J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 45 సంచిక : 19 10.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### • హిందూ ధర్మంపై షర్మిల విషం

## రాజకీయ నాయకురాలా.. మత ప్రచారకురాలా?

- టాయిలెట్ల వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- దళితవాడల్లో టీటీడీ ఆలయాలు కట్టిస్తే తప్పేంటి?
- హిందూ సమాజం సూటి ప్రశ్న
- మత రాజకీయాలు దేశానికే ప్రమాదం అని ఆక్రోశం



దేశంలో కొందరు రాజకీయ నాయకుల వ్యవహార శైలి నందికి పందికి కూడా తేడా తెలియదన్న చందంగా మారిపోతోంది. ఏ విషయాన్ని ఎంతవరకు ప్రస్తావించాలి, ఏఏ అంశాలతో పోల్చాలి అనే కనీస విచక్షణ కూడా కరువయ్యింది. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం చేసే ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలే అందుకు పెద్ద ఉదాహరణగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. "పండితపుత్ర పరమశుంఠ" అన్న సామెత చందంగా, రాజకీయ విమర్శల సాకుతో మత, కులవ్యవహారాలను రెచ్చగొట్టేలా దిగజారి మాట్లాడి ఆమె నవ్వులపాలయ్యారు. పైగా సెక్యులరిజం అనే పదాన్ని రాజ్యాంగ ప్రవేశికలో చేర్చి గొప్పమార్పునకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్‌పార్టీ ప్రతిష్టను కూడా 'టాయిలెట్ వ్యాఖ్యలతో' ఆమె మురుగు కాలువలో కలిపేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక తాను క్రిష్టియన్ అయినా ఎక్కడా కుల, మత వివక్ష లేకుండా పాలన సాగించి తన హయాంలో దళిత గోవిందం, మత్స్య గోవిందం వంటి కార్యక్రమాలను అమలు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురు, ఇలా దిగజారుతారా..? తెలివి తక్కువగా ప్రవర్తిస్తారా..? అంటూ జనం మండిపడుతున్నారు.

### అసలు వివాదం ఇదీ..

ఇటీవల తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలు, అట్టడుగు వర్గాలుండే ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు కట్టించేలా చర్యలు చేపట్టాలని టీటీడీ పాలక మండలి, అధికారులకు సూచించారు. స్థానిక నాయకులు, దాతల సహాయం కూడా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 5 వేల వరకు వెంకన్న ఆలయాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానం డబ్బులతో దళితవాడల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణం చేపట్టడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. నిజంగా దళితులను బాగు చేయాలని చంద్రబాబు భావిస్తే, ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్), బీజేపీ నాయకుల అడుగులకు మడుగులొత్తడం కాకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. టీటీడీ నగదుతో దళితవాడల్లో ఆలయాలు నిర్మించడం కంటే అభివృద్ధి కార్యక్రమాలు, ఇళ్లు, టాయిలెట్లు నిర్మించాలని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను బాగు చేయాలని చెప్పారు. అయితే, ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాల నాయకులు, ప్రజలు మండిపడుతున్నారు. హిందూ ఆధ్యాత్మిక సంస్థ అయిన టీటీడీ నిధులతో దళితవాడల్లో ఆలయాలు నిర్మిస్తే షర్మిలకు వచ్చిన ఇబ్బందేంటి..? అంటూ వారు అగ్గిమీద గుగ్గిల మవుతున్నారు.

### ఇప్పటికే టీటీడీ నిధులతో..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి నగర అభివృద్ధి పేరుతో భారీగా టీటీడీ నిధులను వెచ్చిస్తోంది. తిరుపతిలోని స్విమ్స్, పద్మావతి మెడికల్ కళాశాల, రుయా, బర్డ్ ఆస్పత్రుల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలను దేవస్థానం అందజేస్తోందని హిందూ

10లో



# ‘డిజిటల్ బుక్’తో అరాచకాలకు చెక్



కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు డిజిటల్ బుక్‌తో చెక్ పెడతామని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 8న ఆయన రాపూరు మండలంలోని సంక్రాంతిపల్లి సమీపంలో ఉన్న పాపకన్ను గార్డెన్స్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎస్‌ఇసి సభ్యులు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, బొలిగర్ల మస్తాన్‌యాదవ్ తదితర నాయకులతో కలిసి డిజిటల్ బుక్‌ని ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు అధికమయ్యాయన్నారు. అన్యాయానికి గురైన పార్టీ శ్రేణులకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని, అన్యాయాలను ఎదుర్కొనేందుకు న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చాక, తమపై అక్రమకేసులు బనాయించిన వారందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు.

# టపాసుల గోడౌన్లను పరిశీలించండి

**• అధికారులకు కలెక్టర్ ఆదేశం**

దీపావళి పండుగ వస్తున్న సందర్భంగా, టపాసులతో జాగ్రత్తగా ఉండాలని, అధికారులు టపాసుల తయారీ కేంద్రాల్లోను, టపాసుల గోడౌన్లలోనూ వెంటనే తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల 8న ఆయన అధికారులతో మాట్లాడారు. టపాసుల తయారీదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు సరిగా ఉన్నాయో లేదో పూర్తిస్థాయిలో పరిశీలించాలని అధికారులకు చెప్పారు. టపాసుల తయారీకేంద్రాలు, విక్రయ కేంద్రాలు, గోడౌన్లలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత నివేదికలను 48 గంటల్లో తనకు సమర్పించాలని అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డిని ఆదేశించారు. కేవలం లైసెన్సు పొందినవారే బాణాసంచా తయారీ, నిల్వలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా, టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## సింగపూర్‌లో లాగా...



# ఇక్కడా కొరడా శిక్షలు అమలు చేస్తారా!?

***ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సింగపూర్ దేశం అంటే ఎంత మక్కువో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ప్రజలు ఆయనకు అధికారం అప్పగించినప్పటికీ, లేకపోయినప్పటికీ గత నలభై ఏళ్లల్లో వీలున్నప్పుడల్లా ఆయన సింగపూర్ పర్యటిస్తూనే ఉన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక కూడా వెళ్లి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను సింగపూర్‌గా తీర్చిదిద్దాలనేది ఆయన కల. 2014 - 2019 మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయనకు ప్రభుత్వ నిర్వాహణాధికారం అప్పగించినప్పుడు, అమరావతి ప్రాంత రైతులు కొందరిని ప్రభుత్వ ఖర్చులపై సింగపూర్ పంపించారు, ఎంత డెవలప్ అయిందో చూసిరమ్మని. అమరావతి నగరాన్ని ఆ రేంజ్‌లో నిర్మించాలనేది ఆయన ఆలోచన. ఇప్పుడు కూడా మంత్రులు, అధికారుల టీమ్‌ను వెంటబెట్టుకుని ఆయన ఓ ట్రిప్ సింగపూర్ వెళ్లి వచ్చారు. మిగిలిన మంత్రులు కూడా వీలు చూసుకుని సింగపూర్ వెళ్లి రావాలని చంద్రబాబునాయుడు మంత్రివర్గ సమావేశాల్లోనే సూచిస్తున్నారు.***

అయితే, సింగపూర్ ఆ రేంజ్‌లో అభివృద్ధి కావడానికి మూల కారణాలు ఏమిటనే విషయమై చంద్రబాబు దృష్టి పెట్టినట్టు లేరనేది కొందరి పరిశీలకుల అభిప్రాయంగా ఉంది. సింగపూర్ అనే ఆ మహావృక్షం, దాని కొమ్మలు, రెమ్మలు, పువ్వులు, అవి విరజిమ్మే పరిమళాలు, ఆ చెట్టు ఫలాలు చూసి చంద్రబాబునాయుడు మురిసిపోతున్నారు.

కానీ, ఆ వృక్ష వైభోగానికి కారణమైన భూమిలోని దాని వేరులు ఎంత బలంగా, పురుగు పుట్రా దరిచేరకుండా పాలకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నారో చంద్రన్న గమనిస్తున్నట్టు లేదు.

అక్కడ ‘చట్టం’ అంటే... నేరం చేద్దామనుకునే వారికి టెర్రర్. వెన్నులో వణుకు పుడుతుంది. అసాంఘిక శక్తుల పాలిటి సింహస్వప్నం. అందుకే సింగపూర్ సమాజం అంత అభివృద్ధి చెందింది. చట్టాన్ని అక్కడ అమలుచేసే తీరుకు ఈ ఘటన ఒక ఉదాహరణ

అక్కడ ఒక పబ్లిక్ పార్క్‌లో ఒక అధికారి సిగరెట్టు వెలిగించి... ఒక దమ్ము లాగి వదిలాడు. అక్కడి నుంచి తన విధులకు వెళ్ళిపోయాడు. సీసీ కెమెరాలో ఆ దృశ్యం రికార్డ్ అయింది. పోలీసులు పట్టుకుపోయి కోర్టులో ప్రవేశపెట్టారు. అతనికి ఓ ఆరు నెలలు జైలు, నాలుగు కొరడా దెబ్బల శిక్ష విధించారు.

### మన దగ్గర??

చట్టాన్ని కఠినంగా, నిర్భీతిగా, రాగ ద్వేషాలకు అతీతంగా అమలు చేయాల్సిన పోలీసు వ్యవస్థ గురించి ఏం చెప్పినా బాగుండదు.

దేశాన్ని నిలువునా దోచేస్తూ.. మద్యం, రేషన్ బియ్యం, ఎర్రమట్టి దిబ్బలు, గ్రానైట్ గనులు, భూగర్భ ఖనిజాలు, ఇసుక, నీటి పారుదల ప్రాజెక్టులు, వాటి పేరు మీద మొబలైజేషన్ అడ్వాన్సులు, ఆఫీసర్ల పోస్టింగులు, పదవులకు ఎంపికలు, పార్టీ టికెట్ల అమ్మకాలు, రాజ్యసభ అభ్యర్థిత్వ సేల్సు, మునిసిపల్ బాండ్స్, పోలీస్ సెటిల్మెంట్స్, వారి అకృత్యాలు, బెదిరింపులు, ప్రభుత్వ ఉద్యోగుల ఓపెన్ కరప్షన్... మొదలైన పబ్లిక్ కరప్షన్ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై “సరైన” కేసులు పెట్టడం సాధ్యమయ్యే పనేనా? పెట్టినా... అరెస్టులు చేయగలరా? చేస్తే... గీస్తే.... శిక్షలు సకాలంలో పడతాయా? న్యాయ శాస్త్రం గతంలో చదువుకున్న పుణ్యానికి ఇప్పుడు నల్లకోటు వేసుకు తిరిగే కొంత మందిని చూస్తుంటే!

నేరం చేసిన వారికి జైళ్ళల్లో.... “ఆ సుఖం” తప్ప, అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయి. ఓ రెండు నెలలు జైలులో సుఖ జీవనం గడిపిన తరువాత, బెయిలు వచ్చేస్తుంది. బెయిల్ ఎప్పుడు వస్తుందో అరెస్ట్ అయిన రోజే నిందితులకు అడ్వకేట్లు చెప్పేస్తారు. దాంతో... బెయిల్ రాగానే జయజయ ధ్వానాలు, గజ మాలలు, భారీ ఊరేగింపులు, పుల్లారెడ్డి స్వీట్ల పంపిణీల మధ్య ఊరేగింపుగా తమ తమ స్థావరాలకు చేరుకోవడాన్ని నిందితులు ముందే ప్లాన్ చేసుకుంటున్నారు. మనదగ్గర ఇటువంటి దృశ్యాలు నిత్యకృత్యం. “మేము వస్తాం. మీ చెడ్డీలు విప్పి చూపిస్తాం (వీలైతే మేమూ ఓసారి చూస్తాం)” అంటూ ప్రకటనలు. రప్పా రప్పా పూనకాలు.

అక్కడ, సింగపూర్‌లో... ఈ తరహా దృశ్యం... కనీసం ఊహించడం సాధ్యమా! పొలిటికల్ కరప్షన్... సింగపూర్‌లో దాదాపుగా జీరో. మరి, మన దగ్గర. పాలిటిక్స్‌లో ప్రవేశించేవారిలో 90 శాతం మంది కరప్షన్ కోసమే.. దోపిడీ కోసమే అనిపిస్తుంది.. కళ్ల ముందు జరుగుతున్న రాజకీయ అరాచకాలు చూస్తుంటే. అధికారుల మీద జులుం కోసం కూడా రాజకీయాలనే ఆశ్రయిస్తున్నారు.

సింగపూర్‌లో పొలిటికల్ కరప్షన్ లేదు కనుక, ఆఫీషియల్ కరప్షన్ దాదాపుగా జీరో. పొరపాటున కక్కుర్తిపడి, దొరికితే.... జైలుతో పాటు కొరడా దెబ్బలు.

ఉదాహరణకు, తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు...ఆరోక్కియ సామి(23), రాజేంద్రన్(27) ఈ ఏడాది ఏప్రిల్‌లో టూరిస్టులుగా సింగపూర్ వెళ్లారు. నాలుగు రోజులయ్యేసరికి, వెంట తెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి.

సింగపూర్‌లో “లిటిల్ ఇండియా” అనే ఓ పెద్ద బజార్ ఉంది. అచ్చం చెన్నై లాగానే... గుడులు, గోపురాలు, షాపులు, ఇడ్లీ సాంబార్ బళ్ళు, చెన్నై పాండి బజార్‌లో లాగా, ఫుట్‌పాత్ షాప్‌లు, అంజప్పార్ హోటల్ ఘుమ ఘుమలు, నుదుటున అడ్డంగా విభూతి రేఖలు, లుంగీలతో... మాంఛి తమిళ వాసనలతో “లిటిల్ ఇండియా” ప్రాంతం గుబాళిస్తూ ఉంటుంది. అన్నట్టు నెల్లూరువారి ఫేమస్ బ్రాండ్ - “కోమల విలాస్” హోటల్ కూడా అక్కడ ఉంది. ఈ ఇద్దరు కూడా ఆ బజార్‌లో ఓ హోటల్‌లో ఉంటూ, డబ్బుల కోసం... ఓ ఇద్దరు సెక్స్ వర్కర్స్‌ను లూటీ చేయాలని ప్లాన్ చేశారు.

అక్కడ మిడిల్ మెన్, వ్యభిచారం... అంతా ఆఫీషియల్. రహస్యం ఏమీ లేదు. (వ్యభిచారాన్ని చట్టబద్ధం చేసి, మహిళల గౌరవాన్ని రక్షించాలని 1978, మే మాసం 28వ తేదీ ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఎడిట్ పేజీ వ్యాసం రాశాను)

వీరు కూడా ఇద్దరు మహిళలను “బుక్” చేసుకున్నారు. వారు కూడా అనుకున్న సమయానికి హోటల్‌కు వచ్చారు. వారు రాగానే, గదిలో బంధించి, వారి పాస్‌పోర్ట్‌లు, వారివద్ద ఉన్న సింగపూర్ డాలర్లు, చిన్న చిన్న నగలు, ఇతర వస్తువులు లాగేసుకుని, పంపించేశారు.

మరుసటి రోజు... వారిద్దరిలో ఒక మహిళ... తన వద్దకు వచ్చిన మరో “పాసింజర్”తో ఈ విషయం చెప్పింది. దాంతో, విషయం పోలీసులకు తెలిసింది. ఈ ఇద్దరు తమిళ యువకులను వెంటనే పట్టుకెళ్లి, జైల్లో పారేశారు. ఐదారు నెలల్లోనే ఈ కేసు విచారణకు వచ్చింది. ఇద్దరూ తమ నేరం ఒప్పేసుకున్నారు. దాంతో, దయ తలచిన జడ్జి, వీరిద్దరికీ ఐదేళ్ల వంతున జైలు, 12 వంతున కొరడా దెబ్బల శిక్ష మాత్రమే విధించారు. (మామూలుగా అయితే 20 ఏళ్ళ శిక్ష విధిస్తారు)

మరి, మన దగ్గర ఇలాటి నేరం జరిగితే!? అసలు రెండో కంటివాడికి తెలుస్తుందా. వివాహేతర లైంగిక సంబంధాలు కలిగిన నేతలు మన రాజకీయ వ్యవస్థలో ఎంతమంది!?

అందుకే, సింగపూర్ అంతగా అభివృద్ధి చెందింది. ప్రపంచంలోని ఏ దేశమూ సింగపూర్‌కు ఏ విషయంలోనూ సాటి రాదు. అందుకే, సింగపూర్ పేరు ఎత్తడానికి కూడా మనం అర్హులం కాము. మనకు కులం కావాలి. మతం కావాలి. ప్రాంతం కావాలి. కరప్షన్ కావాలి. ఫ్లెక్సీ ప్రచారం కావాలి. హోర్డింగులు కావాలి. ప్రచార పటాటోపం కావాలి. వ్యక్తి పూజ కావాలి. రప్పా... రప్పా రాజకీయాలు కావాలి. దొంగ రాజకీయం కావాలి.

మనకు సింగపూర్‌తో పోలికలు ఎందుకు? మన వద్ద నేరాలకు పాల్పడినవారికి జైల్ శిక్షలతో పాటు కొరడా దెబ్బల శిక్ష కూడా విధించడం సాధ్యమయ్యే పనేనా? మరి, చట్టం అంటే భయం ఎందుకు ఉంటుంది? మన నేటివిటీ మనది. మన అరాచకం మనది. మన లంచాల గోల మనది. మన బంధుప్రీతి మనది. మన పైరవీ సంస్కృతి మనది. మన మేధా ఇంజనీరింగ్ యాపారం మనది. మన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అండర్‌స్టాండింగ్ మనది.


చంద్రబాబునాయుడు కలల లోకంలో నుంచి వాస్తవ లోకంలోకి రావాలి. చంద్రబాబు-4లో ఆయనకు ఇప్పుడు మూడేళ్లకు మించి సమయం ఆట్టేలేదు. ప్రధాని మోదీ తలుచుకుంటే..ఆ మూడేళ్లు కూడా ఉండదు.

గమనిక : ఆయన సింగపూర్ పేరు ఎత్తినప్పుడల్లా కూటమికి వెయ్యి ఓట్లు పోతాయి.

**- భోగాది వేంకట రాయుడు**

**(జర్నలిజంలో రాష్ట్రప్రభుత్వ ‘కళారత్న’ అవార్డుగ్రహీత)**

# జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెల్లూరుజిల్లాకు రానున్నారు. ఈ నెల 10వ తేదీ శుక్రవారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో ఉన్న విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ని సీఎం ప్రారంభించడంతో పాటు నందగోకులం స్కూల్, గోశాలను ఆయన సందర్శించనున్నారు. అనంతరం నెల్లూరు లోని మైపాడు గేట్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన స్మార్ట్ స్ట్రీట్ దుకాణాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇక్కడ ఏర్పాట్లను మంత్రి నారాయణ ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఈదగాలిలో ఏర్పాట్లపై సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ వెంకటేష్, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ షేక్ అబ్దుల్‌అజీజ్‌లు సమీక్షించి, విశ్వసముద్ర బయో ఇథనాల్ కంపెనీ ప్రతినిధులతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో పండే బియ్యపు నూకలతో బయో ఇథనాల్ తయారీకి రూ.600 కోట్లతో విశ్వ సముద్ర కంపెనీ పరిశ్రమ ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా సోమిరెడ్డి చెప్పారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 1000 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రతి ఇంటికీ జీఎస్టీ ఫలాలు అందాలి

- నెల్లూరు ఎంపీ విపిఆర్ ఆకాంక్ష




ప్రతి ఇంటికీ జీఎస్టీ ఫలాలు అందాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఆకాంక్షించారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జీఎస్‌టీ 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని ఆయన చెప్పారు. జీఎస్‌టీ సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి దీప కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. బుధవారం నెల్లూరులో జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీవీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జీఎస్‌టీ 2.0 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఎస్‌టీ తగ్గింపుతో ప్రజలకు, వ్యాపారులకు కలిగే మేలును ఆయన వివరించారు. దేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతున్న కీలక సమయంలో కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్‌టీ సంస్కరణలు చేపట్టిందన్నారు. ఈ విషయంలో ప్రధాని మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందరూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జీఎస్టీ వల్ల దేశప్రజలకు దాదాపు 2 లక్షల కోట్ల మేర లబ్ది కలుగుతుందని చెప్పారు. తొలుత, జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. 'ఉయ్ సపోర్ట్ జీఎస్‌టీ' అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

# నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌కి అవార్డు




నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్‌స్టేషన్‌కి 'స్వచ్ఛ బస్‌స్టేషన్' అవార్డు లభించింది. ఈనెల 8న ఆ బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆ విషయం తెలిపారు. నిత్యం వేలాదిమంది ప్రయాణీకులు ఈ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం వస్తుంటారని, ప్రయాణీకులకు అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ సిబ్బంది బస్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, దీంతో ప్రభుత్వం అవార్డు ప్రకటించిందని ఆయన చెప్పారు. బస్‌స్టేషన్ ప్రాంగణాన్నంతా శుభ్రపరిచే కార్మికులను ఆయన ఈ సందర్భంగా అభినందించి సన్మానించారు. మహిళా కార్మికులకు చీరలు బహూకరించారు.

# వెంకయ్య మాటలు..
# ఆణిముత్యాలు.. అనుసరణీయాలు

- స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ఆకట్టుకున్న పూర్వ ఉపరాష్ట్రపతి

*భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తన సొంతజిల్లా అయిన నెల్లూరుజిల్లాలో ఇటీవల మూడురోజుల పాటు పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ, దేశ పురోభివృద్ధికి సంబంధించి అనేక అక్షరసత్యాలు.. అనుసరణీయమైన ఆణిముత్యాల్లాంటి మాటలతో వివరించి అందరిలో స్ఫూర్తిని కలిగించారు.*




### ఉచితాలు అనుచితాలే:

ఈనెల 7న వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడుతూ, ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలన్నారు. వాటి వల్ల ప్రజలకు మేలు జరగకపోగా కీడు జరుగుతుందని చెప్పారు. ఉచితాలకంటే అభివృద్ధే ముఖ్యమన్నారు. అసలు ఆ ఉచిత పథకాలకు నిధులను ఎలా సేకరిస్తారో, ఒకవేళ రుణాలు తెస్తే.. వాటిని మళ్ళీ ఎలా తీరుస్తారో అసెంబ్లీలో అఫిడవిట్ ఇవ్వాలని సూచించారు.

### పార్టీ ఫిరాయింపులు పెరిగాయి:

దేశంలో పార్టీ ఫిరాయింపులు బాగా పెరిగాయని, పార్టీ ఫిరాయింపుల చట్టానికి సవరణలు చేయడం అవసరమన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష దారుణంగా ఉంటోందని, కుటుంబసభ్యులపై కూడా విమర్శలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో నైతిక విలువలు ఉండాలని, చట్టసభల్లో సరైన భాష మాట్లాడాలని, ఆమేరకు ఎమ్మెల్యేలకి శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఇటీవల జరిగిన దాడియత్నం శోచనీయమని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వెలిబుచ్చారు. ఆ ఘటన చీఫ్‌జస్టిస్‌కి చెందిన అంశం కాదని సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.

### దేశ ప్రగతికి యువతే కీలకం:

ఈనెల 8న వెంకటాచలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న అక్షర విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రగతికి యువతే కీలకమన్నారు. విద్యాలయాలు చదువుతో పాటు సంస్కారం కూడా పెంపొందించే విధంగా ఉండాలన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ సేవాభావాన్ని, ముప్పవరపు ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న హర్షవర్ధన్‌ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. స్వర్ణభారత్ విద్యామందిరంలో చదువుకుంటున్న చిన్నారుల ప్రతిభ, క్రమశిక్షణ, వారిలోని ఆత్మవిశ్వాసం చూస్తుంటే ముచ్చటేసిందంటూ వారిని ఆయన దీవించారు.

### ఎస్పీ బాలూ విగ్రహాన్ని నెలకొల్పాలి:

ప్రఖ్యాత సినీ గాయకుడు, నెల్లూరీయుడు.. దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏదైనా ప్రముఖ కేంద్రంలో ఏర్పాటుచేయడం సముచితంగా ఉంటుందని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా నెల్లూరు నేతలకు సూచించారు. ఆమేరకు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణతో, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కూడా ఆయన మాట్లాడారు. వారంతా అందుకు సుముఖంగా ఉన్నట్లు కూడా ఆయన తెలిపారు.

నెల్లూరుకు వచ్చిన వెంకయ్యను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు కలుసుకుని పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శీనయ్య, వెంకయ్యనాయుడుతో కలిసి అక్షర విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ తర్వాత..ఆటోలే కీలకం!

బుచ్చి విజయోత్సవ ర్యాలీలో.. ఆటోలో ప్రయాణించిన వేమిరెడ్డి దంపతులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. 'ఆటో డ్రైవర్ల సేవ'లో పథకం విజయవంతమైన నేపథ్యంలో ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెంలో చేపట్టిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఆటోలో కూర్చుని వారు సభకు వెళ్ళారు. 500లకు పైగా ఆటోలతో ఆటో సోదరులు నిర్వహించిన భారీ ర్యాలీ సందడిగా సాగింది.

ఈ సందర్భంగా ఎంపీ విపిఆర్ మాట్లాడుతూ, ఆర్టీసీ బస్సుల తర్వాత ప్రయాణీకులు ఎక్కువగా ఎక్కేది ఆటోలేనన్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 10వేలు అందజేస్తే, కూటమి ప్రభుత్వం ప్రతి ఆటోడ్రైవర్‌కి దసరా కానుకగా రూ.15వేలు వారి ఖాతాల్లో జమచేసి ఆదుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.90లక్షల మంది ఆటో సోదరుల ఖాతాల్లో రూ.435 కోట్లు అందజేస్తే, ఒక్క నెల్లూరు జిల్లాలోనే 17వేల 409 వేల మందికి 26.11 కోట్లు జమ చేశారన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గంలో 2,795 మంది ఆటో సోదరులకు 4 కోట్ల 19 లక్షల 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియచేశారు. స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి, పవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ దొడ్ల విజయలక్ష్మి, బుచ్చి అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ ఏటూరి శివరామ కృష్ణారెడ్డి, బుచ్చి వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లాయర్
అక్టోబర్ 10, 2025

# న్యాయవ్యవస్థపై.. దాడులు దారుణం!

శాంతిమాతగా... సహనానికి నిలువెత్తు సంకేతంగా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మన పవిత్ర భారతదేశంలో రాను రాను అసహనం పెరిగిపోతోంది. వికృతపు ఆలోచనలు, మత విద్వేషాలు, ఉన్మాదపూరితమైన ఉద్వేగాలు పెచ్చుమీరిపోతున్నాయి. సద్భావనలు, సదాశయాలు కరువవుతున్నాయి. అరాచక ప్రవృత్తికి లోబడి సంస్కారయుతమైన ప్రవర్తనలకి కూడా తిలోదకాలిచ్చేసే దుస్థితి దాపురిస్తోంది. క్రమేణా ఈ అనాగరిక ప్రవృత్తి అన్ని రంగాలకు, అన్ని వ్యవస్థలకి కూడా పాకిపోతోంది. మొన్నటికి మొన్న సుప్రీంకోర్టులో జరిగిన ఓ ఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అత్యున్నతమైన భారత న్యాయవ్యవస్థనే కించపరుస్తూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై ఓ సీనియర్ న్యాయవాది బూటుతో దాడి చేయబూనడం దారుణాతిదారుణం. దేశ వ్యాప్తంగా ఆ ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి కూడా.

నిజానికి..ప్రపంచంలోనే అతిపెద్దదైన ప్రజాస్వామిక వ్యవస్థ మన దేశానికి ఒక పెద్ద వరం. ప్రజాశ్రేయస్సును కాంక్షిస్తూ, ప్రజాస్వామ్యాన్ని నిరంతరం కంటికి రెప్పలా కాపాడే మహోన్నత వ్యవస్థగా ఆవిర్భవించిన మన న్యాయవ్యవస్థ మనకు గర్వ కారణం. అయితే, ఎలాంటి రాగద్వేషాలకు, వ్యక్తిగత భావోద్రేకాలకు అతీతంగా ఉంటూ, న్యాయబద్ధంగా వ్యవహరించే న్యాయస్థానాల పట్ల కూడా అరాచకవాదులకు ఏమాత్రం గౌరవం ఉండడం లేదు. ఇక అసలు విషయానికి వస్తే, మధ్యప్రదేశ్‌లోని జవేరీ ఆలయంలో శిథిలావస్థలో ఉన్న ఏడడుగల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలంటూ రాకేశ్ కిశోర్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను, సుప్రీంకోర్టు విచారణకు చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం దానిని పరిశీలించి, గత నెలలోనే ఆ పిటిషన్‌ని తోసిపుచ్చింది. 'అది ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోనిది. అందుకు ఆ సంస్థ అనుమతిస్తుందో లేదో తెలియదు. అనేక అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయని' సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయని రాకేశ్ చెప్తున్నాడు. దానిని సోషల్ మీడియా గోరంతలు కొండంతలు చేసేసింది. తాను అన్ని మతాలను గౌరవిస్తానని సీజేఐ చెప్తున్నా వినకుండా, సోషల్‌మీడియా చేసిన ప్రచారాలు సుప్రీం ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉన్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, మధ్యప్రదేశ్‌లో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే కనుక, ఆ ప్రభుత్వం చేతిలోనే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా కూడా ఉంటుంది కనుక, ప్రభుత్వం అనుకుంటే ఇది ఇంత పెద్ద రాద్ధాంతమయ్యేదే కాదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

ఏదేమైనా, రాజకీయాలు.. మతాలకు సంబంధించిన సున్నితమైన అంశాల్లో కోర్టులు ఎంతో జాగ్రత్తగా తీర్పులు చెప్తుంటాయి. సాధ్యాసాధ్యలను బట్టే తీర్పులు కూడా ఉంటాయి. ఒక్కోసారి పిటిషనర్లకు ఆశాభంగం కావచ్చు. తామనుకున్నది నెరవేర లేదన్న నిరాశ కూడా ఆవరించవచ్చు. అంతమాత్రాన, న్యాయమూర్తులపైనే దాడులకు ప్రయత్నించడాన్ని ఎవరూ హర్షించరు. అందులోనూ సీనియర్ న్యాయవాదిగా ఉంటున్న వ్యక్తి.. సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే అలా వ్యవహరించాలనుకోవడం ఏమిటంటూ దేశప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. విజ్ఞతతో వెతకాలే కానీ, ఎంతటి జటిల సమస్యలకైనా పరిష్కారాలుంటాయని, ప్రత్యామ్నాయ మార్గాలు కూడా బోలెడు ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే. కానీ, ఆ దిశలో కాకుండా, భావోద్వేగాలతోనో, విద్వేషాలతోనో, క్షణికావేశంలోనో దారి తప్పడం హేయం. అందులోనూ, అత్యున్నతస్థానంలో ఉన్న భారత ప్రధాన న్యాయమూర్తిపై ఆగ్రహం ప్రదర్శించడం ఘోరమే కాదు..భయంకరమైన నేరం కూడా.

అయితే, అంతటి పరిస్థితుల్లో కూడా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సంయమనం ఏమాత్రం కోల్పోలేదు. సరికదా, ఆ ఘటన జరిగాక పోలీసులు రాకేశ్ కిశోర్‌ని ప్రశ్నిస్తుంటే, ఆయన్ని వదిలేయండని జస్టిస్ గవాయ్ పోలీసులను ఆదేశించడంతో, పోలీసులు రాకేశ్‌ని వదిలేశారు. కనీసం కేసు కూడా నమోదు చేయలేదు. తనపై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపైనే అంతటి కరుణ చూపడం భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ మానవీయ హృదయ సంస్కారానికి నిదర్శనం. దాంతో, ప్రజల్లో సీజేఐ పట్ల ఉన్న గౌరవభావం మరెంతగానో ఇనుమడించింది. అది ఆయన ప్రతిష్టనే కాక, భారత న్యాయవ్యవస్థ ప్రతిష్టను కూడా పెంచిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.




# ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న కల్తీ మందులు!




మనదేశంలో ఇప్పుడు 'కల్తీ' అన్నది సర్వాంతర్యామిగా మారింది. అది లేని చోటంటూ ఉండడం లేదు. "ఇందుగలదందు లేదన్న సందేహంబు వలదు... ఎందెందు వెదకి చూసినా అందందు ఉన్నదంతా కల్తీయే" అన్నట్లు తయారైంది పరిస్థితి. కల్తీ కాని వస్తువులు మార్కెట్లో అసలు దొరకడం లేదు. చివరికి రోగులకు ప్రాణం పోయాల్సిన మందులు(ఔషధాలు) కూడా కల్తీమయమై ప్రజారోగ్యాన్ని మట్టుపెడుతున్నాయంటే కల్తీ మహమ్మారి ఎంతగా విజృంభిస్తోందో ఊహించుకోవచ్చు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో.. అది కల్తీమందు అని తెలియక నాసిరకం దగ్గుమందును తాగి పాపం 12మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన దేశంలో పెద్ద సంచలనమయ్యింది. అయితే, ఇలాంటి సంచలనాలు మనదేశంలో మామూలే. గతంలో కూడా కల్తీ దగ్గుమందు తాగి జమ్ములో కొంతమంది బాలలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. అంతేకాదు, మనదేశం నుంచి ఎగుమతైన అలాంటి నాసిరకం కల్తీమందుకు జాంబియా, ఉజ్బెకిస్తాన్‌లలో కూడా మరికొంతమంది చిన్నారులు మరణించడం అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో మనదేశపు కల్తీ అంతర్జాతీయంగా వాసికెక్కింది. భారత్‌లోని కల్తీమందులతో జాగ్రత్తగా ఉండాలంటూ సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్యసంస్థే అన్నిదేశాలను హెచ్చరించిందంటే కల్తీమందుల తయారీలో మనదేశంలోని అక్రమవ్యాపారులు ఎంత బరితెగించిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచానికంతా మందులిస్తున్న మనదేశం, నాసిరకం మందులిచ్చి అమాయక రోగుల ఉసురు తీస్తోందనే భయంకరమైన ఆపవాదును కూడా మూటగట్టుకుంది. అందుకు కారణం మరెవరో కాదు, నకిలీ మందుల తయారీదారులు, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులు, మాయమాటలతో రోగులను బురిడీకొట్టిస్తున్న మందుల మాఫియా అన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వాలు అలసత్వంతో ఉండడం వల్లనే ఇలాంటి కల్తీమందులు ఇటీవలికాలంలో అదుపు లేకుండా పెరిగిపోయాయని ప్రజలు వాపోతున్నారు.

## రోగులను నిలువునా దోచుకుతింటున్నారు!

ప్రజలకి ప్రాణం పోసే నిజమైన మందుల పరిశ్రమలు మనదేశంలో అనేకం ఉన్నాయి. దేవుళ్ళలాంటి వైద్యులెందరో ఉన్నారు. కానీ, ఆ పవిత్రమైన రంగంలోకి కూడా కొందరు అక్రమార్కులు జొరబడి దానిని అపవిత్రం చేస్తున్నారు. తమ ధనదాహానికి మందులను నాసిరకం వస్తువులతో తయారుచేసి అమ్మేస్తూ, రోగులను నిలువునా దోచుకుతింటున్నారు. కోట్లాది రూపాయల పాపపుసొమ్ము మూటగట్టుకుంటున్నారు. వారు చేసిన కల్తీ మందులతో రోగుల ప్రాణాలు హరీమంటున్నా వారికి లెక్కే ఉండడం లేదు. పెద్దపెద్ద కంపెనీల మందుల లాగానే, నకిలీవి తయారు చేయడంలో వారు ఆరితేరిపోయారు. అవి కల్తీవని తెలిసినా కమిషన్ల కోసం ప్రజారోగ్యాన్ని కాలరాస్తున్న అనేక మంది అధికారులు, వాటినే మంచి మందులన్నట్లుగా రాసే కొందరు కక్కుర్తి వైద్యులు ఈ పాపంలో పాలుపంచుకుంటున్నారు. అసలే లేనిపోని రోగాలతో, చావలేక బతకలేక అల్లాడుతున్న రోగులకు కల్తీమందులిచ్చి, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమార్కులనేమనాలో అర్థం కాదు. మానవత్వంతో, సేవాభావంతో ఉండాల్సిన వైద్యరంగాన్ని అభాసుపాలు చేస్తూ సర్వనాశనం చేస్తున్నారు. చివరికి ప్రజలు వైద్యమన్నా, మందులన్నా భయపడే దుస్థితికి తీసుకువస్తున్నారు.

## ప్రభుత్వాలు కొరడా ఝుళిపించాలి...

అమాయక ప్రజల ప్రాణాలు హరిస్తున్న ఈ నకిలీమందుల తయారీగాళ్లపై ప్రభుత్వాలు, పాలకులు ఇకనైనా కొరడా ఝుళిపించాలి. ఆయా నకిలీ కంపెనీలపై ఉదాసీనంగా ఉండడం వల్లనే ఇవి విజృంభిస్తున్నాయని సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేంద్రం రంగంలోకి దిగాలి. మందుల మాఫియా కోరలు పెరకాలి. కల్తీమందులు అసలు మార్కెట్లోకి రాకుండా ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలతో కలసి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. నిఘా బృందాలను అప్రమత్తం చేసి, దేశంలో ఏ మూలనున్నా సరే, అలాంటి కల్తీమందుల తయారీదారులను కనిపెట్టి వారి భరతం పట్టాలి. వాటిని మార్కెట్లోకి అనుమతించే అధికారులపై, వాటిని అమ్మే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ కల్తీ నేరాల్లో భాగస్తులైన వారందరిపైన క్రిమినల్ కేసులు పెట్టి శిక్షించాలి. అంతేకాదు, కల్తీ మందులు తయారీలను నియంత్రించేందుకు ఇప్పుడున్న చట్టాలు చాలవు. మరింత కఠినమైన చట్టాలను తెచ్చి, నిష్పాక్షికంగా అమలుచేయాలి. ఇప్పటికే మార్కెట్లో అమ్ముతున్న మందులు ఏమేరకు నాణ్యమైనవో ఎప్పటికప్పుడు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేయిస్తుండాలి. ఆ తనిఖీల ప్రక్రియ నామమాత్రంగా ఉండకుండా, చిత్తశుద్ధితో జరిగేలా నిబద్ధత గల అధికారుల బృందాలను నియమించాలి. ఏదేమైనా సరే, కల్తీమందులను పూర్తిస్థాయిలో నివారించకుంటే, విషవృక్షంలా పెరిగిపోతున్న మందుల మాఫియా ఆట కట్టించకుంటే, అటు రోగుల ప్రాణాలు పోవడమే కాక, ఇటు దేశానికున్న పరువు కూడా పోతుంది...!

- రాజశ్రీ

# నవంబరొస్తోంది తస్మాత్ జాగ్రత్త!

నవంబర్ నెల అంటేనే తుఫాన్లతో భారీ వర్షాలతో నెల్లూరు తడిసి ముద్దయిపోతుంది. ఈ ఏడాది గత నెల రోజులుగా రాష్ట్రమంతా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ఉత్తరాంధ్రలో అయితే భారీ నుండి అతి భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. మన నెల్లూరుజిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వానలు పడలేదు. ఇప్పటివరకూ పెద్దగా వానలు పడకపోయినా, నవంబర్‌లో ముంచేసే అవకాశాలు లేకపోలేదు. అనాదిగా నవంబర్ అంటేనే నెల్లూరులో వర్షాలకు పెట్టింది పేరన్నట్లుగా వరుణుడు జిల్లాని అతలాకుతలం చేస్తాడు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలో డ్రైనేజీలు, కాలువలు, అండర్‌బ్రిడ్జిలు పొంగిపొరలుతాయి. నగరం నడిబొడ్డులో ఉన్న రైలుకట్టకి అటు ఇటు వున్న జనం ఎక్కడివారు అక్కడే ఆగిపోయే పరిస్థితులు ఏర్పడడం అనాదిగా ఆనవాయితీగా మారిపోయింది. ఈసారైనా అధికారులు, నేతలు ముందుగా అప్రమత్తమై వాన కష్టాల నుండి పురప్రజలని గట్టెక్కిస్తారని ఆశిద్దాం! – ఆర్.పీ.రామయ్య, కొండాయపాళెం.

# ప్రాణాలు తీస్తున్న వేలం వెర్రి!

సినిమా నటులు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు వంటి అనేకమంది సెలబ్రిటీల పట్ల వేలం వెర్రిగా ఆకర్షితులవుతున్న వారిని చూస్తే జాలి కలుగుతోంది. తాజాగా తమిళనాడులోని కరూర్ పట్టణంలో టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు సినీ హీరో విజయ్ ప్రచారసభలో భారీతొక్కిసలాట జరిగిన విషయం మనం వార్తల్లో చూశాం. ఈ ఘటనలో పిల్లలు, పెద్దలు, మహిళలు కలిపి మొత్తం 41మంది తమ ప్రాణాలు కోల్పోయారు. వందమందికిపైగా తీవ్ర గాయాలతో ఇంకా వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. తమ నాయకుడిని దగ్గరనుండి చూడాలన్న ఆతృతలో జరిగిన తోపులాట ఈ దుర్ఘటనకి ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ సంఘటన జరిగిన తరువాత 'పోలీసు వారు చూసుకోవాలి' అంటూ ఒక్క మాట చెప్పి సదరు హీరో వేదిక(వాహనం) దిగి వెళ్ళిపోయాడు. జనం ఇలా పిచ్చి పట్టినట్లుగా సెలబ్రిటీల వెనుకపడి ప్రాణాలమీదకు తెచ్చుకోవడం మూర్ఖత్వం. ప్రజల అభిమానాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకోవడం మాత్రమే ఈ సెలబ్రిటీలకి తెలుసు. జనం అవసరాలని గుర్తించి సేవచేయడం వీరికి చేతకాదు. అలాంటి స్వార్థపరుల కోసం ఇలా తమ ప్రాణాల మీదకి తెచ్చుకుని ఎగబడడం జనం అమాయకత్వం! – లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.




# నగర పోలీసు నిలువెల్లా నిర్లక్ష్యం!

నెల్లూరు నగరంలో పోలీసుశాఖ నిలువెల్లా నిర్లక్ష్యంతో పనిచేస్తుందనడానికి సందేహం అవసరంలేదు. నగరంలో ట్రాఫిక్ పరమ ఛండాలంగా తయారయ్యింది. జనం నిర్భయంగా దర్జాగా వన్‌వేలలో ప్రయాణించినా అడిగే నాథుడే లేదు. ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఇక ద్విచక్ర వాహనాల దొంగతనాలు అమాంతం పెరిగిపోయాయి. ఆయా స్టేషన్లలో తూతూ మంత్రంగా ఎఫ్.ఐ.ఆర్.లు నమోదుచేసి మూటగట్టి మూలన పారేస్తున్నారు. తమ వాహనాలు మాయమై నెలలు గడుస్తున్నా ఒక్క వాహనం కూడా రికవరీ కాలేదని వాహన యజమానులు లబోదిబోమంటున్నారు. స్టేషన్లకి వెళ్ళి అడిగితే బైకే కదా పోతే పోయిందిలే ఇంకోటి కొనుక్కో అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని వాపోతున్నారు. కొత్త ఎస్పీ మేడమన్నా ఈ విషయంపై దృష్టిపెట్టాలి. బాధితుల మొర ఆలకించి వారి కష్టాలు తీర్చాలి. తమ శాఖపై లాఠీ ఝుళిపించి నిర్లక్ష్యపు మత్తుని వదిలించాలి! – షేక్ హుసేన్, టెక్కేమిట్ట, నెల్లూరు.

## కల్తీ దగ్గు మందు..
# మన రాష్ట్రానికి రాలేదు

● వైద్య ఆరోగ్యమంత్రి సత్యకుమార్ స్పష్టీకరణ



మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఇటీవల 12 మంది చిన్నారుల మరణాలకు దారితీసిన కల్తీ దగ్గు మందు మన రాష్ట్రానికి సరఫరా కాలేదని, రాష్ట్రప్రజలు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. ఔషధ దుకాణాల వారికి కానీ, ప్రభుత్వాసుపత్రులకు కానీ ఆ కంపెనీ దగ్గు మందు పంపిణీ జరగలేదని వెల్లడించారు. కల్తీ దగ్గుమందుపై రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, రాష్ట్ర ఔషధ నియంత్రణ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమై చర్చించారు. కేంద్ర ఆరోగ్యశాఖ సూచనలు అనుసరించి, రెండేళ్లలోపు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో ఉన్న మందులను వైద్యులు సూచించవద్దని ఆయన అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో కాంచీపురంకి చెందిన కంపెనీ (శ్రీశాన్ ఫార్మస్యూటికల్స్) నుంచి 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు కాంబినేషన్ రూపంలో సరఫరా జరిగిందని, ఈ క్రమంలో డైఇథిలిన్ గ్లైకాల్ నిర్దిష్ట ప్రమాణాల కంటే అధిక మోతాదులో వాడిన కల్తీమందు ఆ రాష్ట్రాల్లో సరఫరా జరిగినట్లు తమకు వైద్యాధికారుల నుంచి నివేదికలందాయని తెలిపారు. మన రాష్ట్రానికి ఆ కల్తీమందుల బెడదలేదన్నారు. అయినా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే..
# కఠిన చర్యలు

జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని.. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను పూర్తిగా అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అంతర్గత తనిఖీ బృందాలను నియమించామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించి నకిలీ విత్తనాలు, ఎరువులు, అక్రమ యూరియా నిల్వలపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో కల్తీ విత్తనాలు, అక్రమ యూరియా నిల్వలపై ప్రత్యేక బృందాల తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఆయన చెప్పారు. యూరియా దుర్వినియోగం మాత్రమే కాకుండా, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలలో కల్తీ లేదా అవకతవకలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రైతులకు అన్నివిధాలా చేయూత!

## అవాస్తవాలను ప్రచారం చేయకండని ఆనం హితవు



నెల్లూరు జిల్లాలో రెండవ కారు వరి పంట పండిస్తున్న రైతాంగానికి పూర్తి స్థాయిలో న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అన్నివిధాలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయమై లేనిపోని విమర్శలు చేయడం సమంజసం కాదని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 4న ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కోసం 58 కొనుగోలు కేంద్రాలను ఈనెల 1వ తేదీన ప్రారంభించామన్నారు. స్థానిక అవసరాల మేరకు గత నాలుగు రోజులలో మరో నాలుగు నూతన కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ఏ ప్రాంత రైతాంగానికైనా అవసరమైతే కేవలం 24 గంటల్లోపు, వారి అవసరాల మేరకు నూతన పీపీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా అధికారులకు సూచించామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48గంటల్లోగా రాష్ట్రంలోని రైతుల ఖాతాలకు నగదు చెల్లించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చారిత్రాత్మక చర్యలు చేపట్టారని, నెల్లూరుజిల్లాలో రబీ సీజన్‌లో మొదటి పంట పండించిన ప్రతి రైతు ఖాతాకు చరిత్రలో మొట్టమొదటిసారిగా 48గంటలలోపు నేరుగా నిధులు జమ చేసిన ప్రభుత్వం తమదని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతుల కోసం అత్యంత పారదర్శక పాలన అందిస్తుంటే దురదృష్టవశాత్తు కొంతమంది అధికారులను బెదిరిస్తూ.. రైతాంగాన్ని ముఖ్యపెట్టే అవాస్తవ వార్తలను ప్రచారంలోకి తేవడం బాధాకరమన్నారు. అలాంటి నిరాధార వార్తలు ప్రచారంలోకి రాకుండా చూడాలని ఆయన జిల్లా అధికారులకు సూచించారు.

# నవంబర్ 5న..మహా కార్తీక దీపోత్సవం

● 7న శ్రీస్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నవంబరు 5న నెల్లూరులో పెద్దఎత్తున కార్తీకదీపోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి. నెల్లూరు చెరువు గట్టుపై వెలసివున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం సమీపంలోని గణేష్ ఘాట్ చెంతనున్న శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆరోజున మహా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కె.వెన్నెల, ఉపాధ్యక్షురాలు కే.జయప్రద తెలిపారు. నెల్లూరులోని ఎన్ఆర్ కళ్యాణమండపంలో ఇటీవల కార్తీక దీపోత్సవ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 5వ తేదీ ఉదయం ఆరు గంటలకు గోపూజతో వేడుకలు ప్రారంభిస్తామన్నారు. రుద్రహోమం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం, సాయంత్రం ఆకాశ దీపోత్సవం గంగా హారతి, మహా కార్తీక దీపోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా నవంబరు 7న శ్రీ స్వర్ణలింగేశ్వర స్వామివారి వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు శ్రీకంఠం రమణయ్య, కోడూరు జయరామయ్య, ముక్కాల ద్వారకానాథ్, ఏవీఆర్ మోహన్‌రావు, రఘునాథరాజు, సి.జనార్ధన్‌రాజు, వి.హర్షవర్ధన్, కాకు మురళిరెడ్డి, గడ్డం విజయకుమార్, కార్తీక దీపోత్సవ కమిటీ కార్యదర్శి ప్రవీణ, పలు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పాటుపడే..
# 'పాపకన్ను'కు సముచిత స్థానం!

● అభినందించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి నియోజకవర్గం..రాపూరు మండలంలోని వైసీపీ సీనియర్ నాయకుడు, పార్టీకోసం నిరంతరం పాటుపడుతున్న పాపకన్ను మధుసూదన్‌రెడ్డికి ఎట్టకేలకు పార్టీలో సముచిత స్థానం లభించింది. ఆయన సేవలను అధిష్ఠానం గుర్తించి, తాజాగా వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఆయన్ను నియమించింది. దీంతో ఆయన ఈనెల 6న నెల్లూరులోని నేదురుమల్లి నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆయన ఆశీస్సులందుకున్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసే తత్వమున్న మధుసూదన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి కౌన్సిల్‌లో కీలకస్థానం దక్కడం పట్ల రామ్‌కుమార్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, పాపకన్నును సన్మానించారు. వైసీపీ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో మధుసూదన్‌రెడ్డికి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా బాధ్యతలు ఇవ్వడం అభినందనీయమన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని రామ్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా పాపకన్నుకు చెప్పారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకులకు పార్టీలో ఉన్నతస్థానం లభిస్తుందన్నారు. రాపూరు మండల వైసీపీ అధ్యక్షుడు బొద్దు మధుసూదన్‌రెడ్డి, నాయకులు దందోలు నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, మలిరెడ్డి సంజీవరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, వంకిపోలు ఉమామహేశ్వరరెడ్డి, ఎస్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్‌పై.. డీటీసీ ఆకస్మిక తనిఖీలు

➤ 238 కేసుల నమోదు ➤ 17.5 లక్షల అపరాధ రుసుం

***పండుగ రోజులు వస్తే చాలు..ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల వాళ్లదే పండుగంతా. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకుల నుంచి ఇదే అదనుగా అదనపు ఛార్జీలు వసూలు చేసి ధనార్జన చేస్తుంటారు. ఉదాహరణకు 800 నుంచి 1000 రూపాయల వరకు ఉండే బస్సు ఛార్జీలను అమాంతం పెంచేసి రెండున్నర నుంచి 3వేల రూపాయలకు పైగానే ముక్కుపిండి వసూలు చేయడం వాళ్లకి మామూలే. నిబంధనలకి విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న ఆ బస్సులపై రవాణాశాఖ దృష్టి సారించి, వాటిపై చర్యలకి ఉపక్రమించింది. ఇటీవల నెల్లూరు సమీపంలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నెల్లూరు ఉప కమిషనర్ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగి, ట్రావెల్స్ బస్సులవారి అక్రమాలపై కొరడా ఝుళిపించారు.***



దసరా పండుగ దినాల్లో ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్నవారి నుంచి, నిబంధనలకు వ్యతిరేకంగా..అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై నెల్లూరు ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) చందర్ ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు ఇటీవల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికమొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న బస్సులను గుర్తించి కేసులు పెట్టారు. దసరా రోజుల్లో.. గత నెల 28 నుంచి ఈనెల 7వతేదీ వరకు చేసిన తనిఖీల్లో మొత్తం 238 కేసులు నమోదు చేశారు. అంతేకాక, ఆ బస్సులకు 17.5 లక్షల రూపాయలను అపరాధ రుసుంగా విధించారు. ఇంత పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేయడం జిల్లాలో సంచలనం కలిగించింది. ఈ సందర్భంగా డీటీసీ చందర్ మాట్లాడుతూ, ప్రయాణీకుల వద్ద అధిక మొత్తాలను వసూలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల వారిని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో బ్రేక్ ఇన్స్‌పెక్టర్లు మురళీమోహన్, షఫీ, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీటీసీ చందర్

# నెల్లూరు కబుర్లు

## కాలుష్యాన్ని నియంత్రించాలి

### ఎమ్మెల్యే సోమిరెడ్డి



వస్తు తయారీలో ప్రమాణాలు పాటించడమే కాకుండా, కాలుష్యాన్ని కూడా నియంత్రించాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆయన నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మరియు ఎఫ్ఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వ హించిన స్టాండర్డ్స్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ వస్తువు అయినా వినియోగదారులకు ఇబ్బంది లేకుండా, మంచి నాణ్యతతో అందించాలన్నారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ప్రధానంగా పేదలు, గిరిజనులు కాలుష్యం బారినపడుతున్నారని, దానిని వెంటనే నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య, కలెక్టర్ హిమాన్షు శుక్లా, విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి



మహాకవి వాల్మీకి జయంతి సందర్భంగా ఈనెల 8న నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం గొప్పదనాన్ని ఆమె వివరించారు. జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి.. వైసీపీ వర్క్‌షాప్



పార్టీ బలోపేతమే లక్ష్యంగా యువతలో స్ఫూర్తిని నింపేందుకు వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల నెల్లూరు రాంజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ నగర నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులతో వర్క్‌షాప్ నిర్వహించారు. సంఘాల అధ్యక్షులు.. డివిజన్ ఇంచార్జ్‌లను సమన్వయం చేసుకుంటూ, నియోజక వర్గస్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. రాబోయే రోజుల్లో.. వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు.



నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఇటీవల మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి

## ప్రజలంతా గర్వంగా చెప్పుకునేలా పనిచేస్తా!

### • ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలని ప్రజలంతా గర్వంగా చెప్పుకునేలా పనిచేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన 11 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఐట్వాడిపాళెం నుంచి దైకాస్ రోడ్డు వరకు చేపట్టిన 5 కిలోమీటర్ల సీసీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, డ్రైన్, గ్రీనరీ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. భారత వాయు సేన విశ్రాంత కార్గిల్ వింగ్ కమాండర్ వల్లూరు శ్యామ్‌ప్రసాద్ చేతుల మీదుగా ఆ పనులను ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలు ఉన్నా లేకున్నా తాను నిరంతరం ప్రజలతోనే ఉంటానన్నారు.

### త్వరలోనే..పొట్టేపాళెం వంతెన పనులు

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పొట్టేపాళెం వంతెన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన పాత వెల్లంటి గ్రామంలో 3కోట్ల 11లక్షలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, దీనివల్ల పాత వెల్లంటి, కొత్త వెల్లంటి, గొల్లకందుకూరు, సజ్జాపురం, కందమూరు గ్రామాల ప్రజలకు ఇక కరెంటు కష్టాలు ఉండవని తెలిపారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం జరగాలి

### • రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

బీసీలకు న్యాయం జరగాలని వామపక్ష పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ, బీసీల జనాభా ప్రాతిపదికన రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలన్నారు. బీసీలకి రావలసిన రిజర్వేషన్‌లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. జన గణనతో పాటు కులగణన కూడా జరపాలని కోరారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అధ్యక్షత వహించారు. ఎన్.రమణయ్య, పి.మాలకొండయ్య, వినోదమ్మ, పములుల దశయ్య, వి.రామరాజు, లీలా మోహన్, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.





## నెల్లూరీయులకు

## జాతీయ సేవా పథకం అవార్డులు

### • రాష్ట్రపతి చేతులమీదుగా ప్రదానం

ఎంతో విశిష్టమైన జాతీయ సేవా పథకం అవార్డులను ఈసారి ఇద్దరు నెల్లూరీయులు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వారు ఆ అవార్డులను అందుకోవడం జిల్లాకే గర్వకారణం. రాష్ట్రపతి భవన్‌లో ఈనెల 7న జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో, నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్ఎస్ఎస్ స్వయంసేవక్ ఎం.పృథ్వీరాజ్, నెల్లూరులోని నారాయణ దంత కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్వయంసేవక్‌గా ఉన్న జి.విష్ణురెడ్డిలకు 2022–23 సంవత్సరానికి సంబంధించి 'మై భారత్–జాతీయ సేవా పథకం' అవార్డులు లభించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొన డంతో పాటు, విభిన్న సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపట్టి నందుకు వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులను సాధించిన వీరిద్దరిని ఎన్ఎస్ఎస్ అధికారులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర!



స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని ప్రజలందరి భాగస్వామ్యంతోనే అది విజయవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి దాకా ఉత్తమ సేవలందిస్తున్న వారికి అవార్డులు బహూకరించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శీనయ్య, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలి



నెల్లూరు నగరాన్ని చెత్తరహిత దోమల రహిత నగరంగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని నెల్లూరులోని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. 'ఒక్కోరోజు ఒక వీధి పరిశుభ్రం' కార్యక్రమంలో భాగంగా స్థానిక 14వ డివిజన్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమం పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని, అందుకు ప్రజలందరూ తోడ్పాటునందించాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు గణేశం వెంకటేశ్వర్లరెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి ఆయన రోడ్డు పరిశుభ్రతా చర్యలను పర్యవేక్షించారు.

## ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయొద్దు

ఏపీఎస్ ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనలు చేయొద్దని, ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రైవేటు వారితో నడిపించాలని అనుకోవడం ప్రైవేటీకరణలో భాగమేనని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు సుందరయ్య, అయ్యపరెడ్డి అన్నారు. ఈనెల 7న నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ 12వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తే ఆ చర్యలను అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు.



## చిరు వ్యాపారులకు..

# మంత్రి నారాయణ చేయూత

### • సొంత నిధులతో.. 75 మందికి తోపుడు బండ్లు




నెల్లూరు నగరంలోని నిరుపేదలు 70 మందికి జీవనాధారంగా ఉండేందుకు తోపుడుబండ్లను, మరో అయిదుగురికి ఇస్త్రీ బండ్లను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పేదరికం నుంచి వచ్చాను కాబట్టే తనకు పేదల కష్టాలు తెలుసునని, అందుకే సొంత నిధులతో నిరుపేదల కోసం తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నానని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈనెల 6న నెల్లూరు నగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్మార్ట్‌స్ట్రీట్‌లో వ్యాపారాలు చేసే 120 మంది మెప్మా మహిళలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల వంతున ఆర్థిక సహాయం చేశానన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 75 మంది వీధి వ్యాపారులకు బతుకుతెరువు కల్పించేందుకు తోపుడుబండ్లు, ఇస్త్రీ బండ్లు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందని మంత్రి నారాయణను ప్రశంసించారు. ఇప్పటివరకు సుమారు 476 మందికి తోపుడుబండ్లను మంత్రి అందజేశారని ఆయన తెలిపారు. దీంతో చిరు వ్యాపారులు అద్దెకి బండ్లు తీసుకొనే బాధ లేకుండా చేశారన్నారు. అభివృద్ధి అంటే నారాయణ-నారాయణ అంటే అభివృద్ధి.. ఇది నిజం అని ఆయన అన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.



## మార్కెట్ వ్యాపారులకు అండగా ఉంటా

ఇటీవల నెల్లూరులోని సంతపేటలో అగ్నిప్రమాదానికి గురైన దుకాణాల సముదాయాన్ని మంత్రి నారాయణ ఇటీవల పరిశీలించారు. మార్కెట్ వ్యాపారులకు తాము అండగా ఉంటామని, బాధితులను ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. బాధితులకు త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామని మంత్రి తెలిపారు.

## 40 లక్షలతో.. అబ్దుల్ కలాం పార్క్

నెల్లూరు 48వ డివిజన్‌లో రూ.40లక్షలతో డా.ఏపీజే అబ్దుల్ కలాం పార్కును ఆధునీకరించారు. మంత్రి నారాయణ ఇటీవల ఆ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ పిల్లలతో ఆటలాడించి, చాక్లెట్లు పంచి సరదాగా గడిపారు. ఆహ్లాదభరితంగా పార్కును తీర్చిదిద్దిన మంత్రికి చిన్నారులతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ తర్వాత 48వ డివిజన్ విరాట్ నగర్, 49 డివిజన్ సుబ్బారెడ్డి వీధిలో ఏర్పాటు చేసిన మూడు ఎన్టీఆర్ సుజల సురక్ష తాగునీటి ప్లాంట్లను మంత్రి ప్రారంభించారు. 20 వాటర్ ప్లాంట్లను ఇప్పటికే పూర్తి చేశామని, మరో రెండు నెలల్లో మరో 40 ప్లాంట్లు పూర్తి చేస్తామని తెలిపారు.

## చేపల మార్కెట్‌కు మంచిరోజులు

నెల్లూరు నగరంలోని మూడవ డివిజన్ వేణుగోపాల్ నగర్, మైపాడు రోడ్డులో ఉన్న చేపల మార్కెట్‌కి మంచిరోజులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక, మంత్రి నారాయణ చొరవతో రూ. 20 లక్షలతో దీనిని ఆధునీకరించారు. ఇటీవల దానిని మంత్రి నారాయణ పునః ప్రారంభించారు. దీంతో వ్యాపారుల ఆనందానికి అవధుల్లేవని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

## ఆటో సోదరులకి అండగా ప్రభుత్వం



ఆటో డ్రైవర్ల కష్టాన్ని సీఎం చంద్రబాబు దగ్గరగా చూశారని, వారి బాధలను తీర్చేందుకే 'ఆటో డ్రైవర్ల సేవలో' అనే పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి డా. పొంగూరు నారాయణ తెలిపారు. స్త్రీ శక్తి పథకం వల్ల నష్టపోతున్నామంటూ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో, ఆటోవారికి అండగా నిలిచేందుకు, ఏడాదికి రూ. 15000 ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సంకల్పించడం సంతోషకరమన్నారు. అలాగే ఆటో యజమానుల కోసం ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను కుదించడం జరిగిందని, రూ.20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రూ.3 వేలకు తగ్గించడం వారికెంతో మేలును కలుగజేస్తుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.



# 'ఆటో డ్రైవర్ల సేవ'లో మంత్రి ఆనం

రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ సోదరులకు ప్రతి ఏడాది 15వేల రూపాయల ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించే ప్రతిష్ఠాత్మక "ఆటో డ్రైవర్ల సేవలో" కార్యక్రమం ఇటీవల నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్‌బిఎస్ కళ్యాణమండపంలో జరిగింది. రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా సమక్షంలో, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దీనిని ప్రారంభించారు. నెల్లూరుజిల్లాలో స్వంత ఆటోరిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ కలిగిన ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15000లు చొప్పున మొత్తం 17,406 మందికి దాదాపు రూ.26.10 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లోకి జమ చేశారు. ఆమేరకు చెక్కును ఆటోడ్రైవర్ల ప్రతినిధులకు అందజేశారు. డీటీసీ చందర్, మున్సిపల్ కమిషనర్ నందన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ఆటో సంఘాల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అంతకుముందు ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం ప్రారంభించినందుకు సంతోషం వ్యక్తంచేస్తూ ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒంగోలు ఎంపీ మాగుంట శీనయ్యతో కలసి పాల్గొని, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నేతలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైలం ట్రస్ట్ బోర్డులో..

# వేమిరెడ్డి కోటారెడ్డికి పదవి



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరులు వేమిరెడ్డి కోటారెడ్డిని శ్రీశైలం ట్రస్ట్ బోర్డులో కీలక పదవి వరించింది. రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం దేవాలయం ట్రస్ట్ బోర్డును ఇటీవల ప్రకటించగా, ఆ పాలక మండలిలో 14 మంది సభ్యులకు గాను నలుగురు ప్రత్యేక ఆహ్వానితులు ఉన్నారు. ఆ నలుగురిలో కోవూరు నియోజకవర్గం నుండి వేమిరెడ్డి కోటారెడ్డిని నియమించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(విపిఆర్) గెలుపు కోసం కోటారెడ్డి అల్లూరు మండల టిడిపి ఇన్‌చార్జిగా అలుపెరుగని కృషి చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన విపిఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయానికి కూడా ఆయన ఎంతగానో శ్రమించారు. ఈ నేపథ్యంలో ఆయన కోవూరు నియోజకవర్గం కోటా కింద శ్రీశైల మల్లన్న సేవకు ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులు కావడం విశేషం!

### ముఖ్యమంత్రికి ధన్యవాదాలు :

ప్రఖ్యాత శైవక్షేత్రం..శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డులో తనను ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వేమిరెడ్డి కోటారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు ఆ పదవి రావడంలో సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన సోదరులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీఎంఆర్ గ్రూప్‌కి.. 'స్వచ్ఛ పరిశ్రమ' అవార్డు



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుకు చెందిన బీఎంఆర్ గ్రూప్‌కి 'స్వచ్ఛ పరిశ్రమ' అవార్డు లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా బీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు ఆ అవార్డును అందుకున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు కృషిచేస్తున్న సంస్థలు, వ్యక్తులకు, ప్రభుత్వ విభాగాల్లో అత్యుత్తమంగా పనిచేస్తున్నవారికి ఈ అవార్డులు బహుకరిస్తారు. ఇందులో భాగంగా పరిశ్రమల విభాగంలో ఉత్తమ సేవలందిస్తున్న బీఎంఆర్ గ్రూప్‌కి ఆ అవార్డును ప్రదానం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను సాధించడంలో సంస్థలు, వ్యక్తులు మరియు ప్రభుత్వ విభాగాల అత్యుత్తమ పనితీరును గుర్తించి, జిల్లా స్థాయిలో స్వచ్ఛపరిశ్రమల కేటగిరీ కింద బీఎంఆర్ గ్రూప్‌కి అవార్డును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లాతో పాటు కావలి శాసనసభ్యులు దగుమాటి కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల్లో... కనీస వసతులుండాలి

### - రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మెన్ జవహర్ -



ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, విద్యార్థులకు ఎటువంటి లోటు రానీయకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మెన్ కెఎస్ జవహర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల 8న ఆయన నెల్లూరులోని ఆర్ అండ్ బీ బంగ్లాలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్యంగా చదువుతోపాటు ఆరోగ్యం, దేహదారుఢ్యం, పారిశుధ్యం, పర్యావరణం వంటి వాటిపై ప్రత్యేకంగా అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులు అతి తక్కువగా నమోదవడం జిల్లా అధికారుల ఉత్తమ పనితీరుకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. తొలుత, వివిధ వర్గాల నాయకుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## దళితులకు న్యాయం చేయాలి



జిల్లాలో భూమి లేని ఎస్సీలకు భూములివ్వాలని ఈ సందర్భంగా అఖిలభారత బహుజనుల సంక్షేమ సంఘం(ఏఐబీడబ్ల్యుఏ) తరఫున నెల్లూరు పట్టణ అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నేపల్లి దాస్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ జవహర్‌ను కోరారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను వారు ఆయన దృష్టికి తెస్తూ, జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను బలోపేతం చేసి, దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో దళితులను దేవాలయాల్లోకి రానివ్వకుండా నేటికీ అక్కడక్కడా కొందరు అగ్రవర్ణాల వారు ఆటంకాలు కల్పిస్తున్నారని వారు పేర్కొంటూ, దళితులందరికీ దేవాలయ ప్రవేశం కల్పిస్తూ ప్రభుత్వం జీఓ తీసుకురావాలని కోరారు.

## సమ్మెకాలానికి జీతం ఇవ్వాలి

### • సీపీఎం నాయకుల వినతి



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెల్లూరులోని మునిసిపల్ కార్మికులు ఈనెల 7న రోడ్డెక్కారు. సీఐటీయు ఆధ్వర్యంలో, ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సారథ్యంలో జరిగిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయు నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో నాయకులు ఇచ్చిన మాట ప్రకారం సమ్మెకాలానికి జీతాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో మునిసిపల్ యూనియన్ నాయకులు మనోజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పాత ప్రేమలు మళ్లీ చిగురిస్తున్నాయి



అమెరికా – పాకిస్థాన్ మధ్య పాత ప్రేమలు మళ్లీ చిగురిస్తున్నాయి. భారత ఎదుగుదలను జీర్ణించుకోలేక ఆ రెండు దేశాలు చేతులు కలుపుతున్నాయి. పాకిస్థాన్‌ను వీలైనంత బలోపేతం చేయాలని అమెరికా కంకణం కట్టుకున్నట్లు తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

అమెరికా, పాకిస్థాన్‌తో క్షిపణి రక్షణ వ్యవస్థ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ వార్త భారతదేశంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి సమర్థవంతంగా స్పందించిన భారత సైన్యం, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటింది. ఈ నేపథ్యంలో, అమెరికా-పాకిస్థాన్ ఒప్పందం భారతదేశ భద్రతా ఆందోళనలను మరింత పెంచుతోంది.

పాకిస్థాన్‌కు అమెరికా సైనిక సహాయం కొత్తేమీ కాదు. గతంలో ఎఫ్-16 యుద్ధ విమానాలు, డ్రోన్ టెక్నాలజీ వంటి అనేక సైనిక సామాగ్రిని అమెరికా అందించింది. అయితే, ఈ క్షిపణి రక్షణ వ్యవస్థ ఒప్పందం దక్షిణాసియాలో శక్తుల సమతుల్యతను మార్చే అవకాశం ఉంది. భారతదేశం తన రక్షణ వ్యవస్థలను ఆధునీకరిస్తూ, రష్యా నుంచి ఎస్-400 వంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను సమకూర్చుకుంటోంది. అలాంటి సమయంలో, పాకిస్థాన్‌కి అమెరికా సహాయం భారతదేశంలో అనుమానాలను రేకెత్తిస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో విదేశాంగ విధానం ఊహించని మలుపులు తిరుగుతోంది. భారతదేశంతో వాణిజ్య సంబంధాలు, రక్షణ ఒప్పందాల్లో అమెరికా సానుకూల వైఖరి చూపినప్పటికీ, పాకిస్థాన్‌తో ఈ కొత్త ఒప్పందం భారతీయ విశ్లేషకులను ఆందోళనకు గురిచేస్తోంది. చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ) వంటి ప్రాజెక్టులు భారత భద్రతకు సవాళ్లను లేవనెత్తాయి. ఇప్పుడు అమెరికా సైనిక సహాయం పాకిస్థాన్‌కు మరింత ధైర్యాన్ని ఇవ్వవచ్చు, ఇది భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉంది.





ఈ రాజకీయ, సైనిక సంబంధాలకు తోడుగా, అమెరికా-పాకిస్థాన్ మధ్య ఆర్థిక, వనరుల సహకారం కూడా త్వరగా పెరుగుతోంది. 2025 సెప్టెంబరులో, అమెరికా కంపెనీ 'యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్' (USSM) పాకిస్థాన్‌తో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద, పాకిస్థాన్ తన ఖనిజాలు, రేర్ ఎర్త్‌మెటల్స్ (REE) మరియు క్రిటికల్ మినరల్స్ (అంటిమనీ, కాపర్ వంటివి)ను అమెరికాకు సరఫరా చేయడానికి సిద్ధమవుతోంది. ఇటీవల, పాకిస్థాన్ తన మొదటి షిప్‌మెంట్‌ను అమెరికాకు పంపింది. ఈ పెట్టుబడి పాకిస్థాన్‌లో ప్రాసెసింగ్ సదుపాయాలు, పెద్దఎత్తున ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుంది. అమెరికా తన క్రిటికల్ మినరల్స్ లిస్ట్‌ను 2025 ఆగస్టులో అప్‌డేట్ చేసి, ఈ రకాల మినరల్స్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని కోరుకుంటోంది.

భారత దృక్కోణం నుంచి చూస్తే, ఈ రేర్ ఎర్త్ మెటల్స్ వ్యాపార ఒప్పందం ఆందోళనాత్మకం. ఈ మెటల్స్ రక్షణ సాంకేతికతలు, ఎలక్ట్రానిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీలో కీలకమైనవి. పాకిస్థాన్‌కు ఈ ఆర్థిక పెట్టుబడి, సైనిక సహాయంతో కలిసి, దాని ఆర్థిక స్థిరత్వాన్ని పెంచి, ఉగ్రవాదానికి మద్దతును మరింత బలపరచవచ్చు. ఇది భారతదేశానికి మరో సవాలు – ఎందుకంటే, చైనా ఇప్పటికే రేర్ ఎర్త్ మెటల్స్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తోంది. పాకిస్థాన్‌తో దాని సంబంధాలు భారత భద్రతకు ముప్పు. భారతదేశం తన రేర్ ఎర్త్ మినరల్స్ ఉత్పత్తిని పెంచుకోవడానికి, ఆస్ట్రేలియా, జపాన్‌తో సహకారాలు బలోపేతం చేసుకోవాలి.

భారతదేశం తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. భారత రక్షణ శాఖ ఇప్పటికే అగ్ని, బ్రహ్మోస్ వంటి స్వదేశీ క్షిపణులతో తన సామర్థ్యాన్ని బలోపేతం చేసుకుంది. అదే సమయంలో, అమెరికాతో రక్షణ సహకారాన్ని మరింత బలపరచడం ద్వారా ఈ సవాలును సమతుల్యం చేయవచ్చు. క్వాడ్ (QUAD) ద్వారా జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాలతో సహకారం, ఇజ్రాయెల్, ఫ్రాన్స్ వంటి దేశాలతో రక్షణ ఒప్పందాలు భారతదేశానికి వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తాయి. రేర్ ఎర్త్ మెటల్స్ విషయంలో కూడా, భారతదేశం తన దౌత్య శక్తిని ఉపయోగించి, అమెరికాతో బహుళపక్షీయ సహకారాలు రూపొందించాలి. అమెరికాతో సంబంధాలను కాపాడుకోవడంతో పాటు, పాకిస్థాన్ దురాగతాలను అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టాలి.

ఈ సమయంలో భారతదేశం జాగ్రత్తగా, వ్యూహాత్మకంగా ముందుకు సాగాలి. అమెరికా-పాకిస్థాన్ ఒప్పందాలు – సైనికమైనా, ఆర్థికమైనా – భారత భద్రతకు సవాలుగా ఉన్నప్పటికీ, భారతదేశం తన సైనిక, దౌత్య సామర్థ్యాలతో ఈ సవాలును ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం కోసం భారతదేశం తన పాత్రను నిర్వహిస్తూనే, ప్రపంచ సమాజంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## న్యాయవాదుల నిరసనలు

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ, నెల్లూరులోని న్యాయవాదులు ఈనెల 7న విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా పలు కోర్టుల్లోని న్యాయవాదులు కూడా ఆ ఘటనను నిరసించారు. అఖిలభారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని కోర్టు ఆవరణలో నిరసనలు వెల్లువెత్తాయి. లాయర్స్ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షులు అంకయ్య, కార్యదర్శి రమేష్, సీనియర్ న్యాయవాదులు కుడుముల రవికుమార్, జల్లి పద్మాకర్, బద్దెపూడి రవీంద్ర, స్వర్ణ ప్రసాద్, పచ్చా కిరణ్ తదితరులు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం రాజ్యాంగ వ్యవస్థలపైనే దాడికి పూనుకోవడం వంటిదని, ఇది అమానుషమని, ఇలాంటి దురంతాలను తాము సహించేది లేదని స్పష్టం చేశారు. సనాతన ధర్మం పేరుతో ఇలాంటి దాడులు జరగడం దారుణమన్నారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి.. న్యాయవ్యవస్థ వర్ధిల్లాలంటూ వారు నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో సీనియర్ న్యాయవాదులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, విజయమోహన్‌రెడ్డి, చేవూరు శ్రీధర్, వెంకటేశ్వర్లు, రాఘవ, సుధీర్, శివకుమార్, మెబీనా, కుమార్ రాజా, మహిళా న్యాయవాదుల ప్రతినిధి లక్ష్మమ్మ పాల్గొన్నారు.

### సీపీఎం ధర్నాందోళన :

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఓ లాయర్ దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 7న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు సారథ్యంలో, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఆందోళన నిర్వహించారు. సీజేఐపై కాలి బూటు విసరడానికి ప్రయత్నించడం మతోన్మాద చర్య అంటూ వారు నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు కొండా ప్రసాద్, పెంచల నరసయ్య, సతీష్, సుధాకర్, కోటేశ్వరరావు, మాలకొండయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో పెల్లుబికిన నిరసన :

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి యత్నానికి పాల్పడడం ఘోరమంటూ ఆత్మకూరులో బార్ అసోసియేషన్ సభ్యులు ఈనెల 7న విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు వద్ద నుంచి ఆత్మకూరు పట్టణంలోని మునిసిపల్ బస్టాండ్ వద్ద ఉన్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది కేవీ శేషారెడ్డి మాట్లాడుతూ, సీజేఐపై దాడికి తెగబడడం, ఆ తర్వాత సిబ్బంది ఆ న్యాయవాదిని బయటకు తీసుకువెళ్తున్నపుడు కూడా కేకలు వేస్తూ వీరంగం చేయడం మతోన్మాదానికి నిదర్శనమని విమర్శించారు. దేశ ప్రతిష్టను దిగజార్చేవిధంగా అలా ప్రవర్తించడం క్షమించరాని విషయమన్నారు. ఈ ఆందోళనలో ఆత్మకూరు లాయర్ల సంఘం అధ్యక్షుడు సిరాజుద్దీన్, సీనియర్ న్యాయవాది ఎల్‌వీ రమణయ్య, న్యాయవాదులు నజీర్, ఓబులేసు, తిరుపతమ్మ, మధు, హరికృష్ణ, పార్థు, రామ్:గోపాల్‌రెడ్డి, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### వైద్య ఉద్యోగుల సంఘం ఆందోళన

కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు తీరని అన్యాయం చేస్తోందంటూ నెల్లూరులోని యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈనెల 7న నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో జరిగిన యూనియన్ జిల్లా మహాసభలో నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తమపై కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నేటికీ పీఆర్‌సి కమిషన్ వేయలేదని, ఐఆర్ ప్రకటించలేదని, చివరికి ఒక్క డీఏ కూడా ఇవ్వలేని ఆవేదనతో చెప్పారు. ఇకనైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## 'కర్మయోగి'కోర్సుల్లో..
# చంద్రశేఖర్‌రెడ్డి రికార్డు

**• జాతీయస్థాయిలో ఫస్ట్ ర్యాంక్**



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కర్మయోగి' కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు అందిస్తున్న ఐ గాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్లైన్ ట్రైనింగ్-ఐ గాట్) కర్మయోగి కోర్సుల సెప్టెంబర్ నెల ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామంలో జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డి 5001 పాయింట్లు సాధించి, జాతీయస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ ఉపాధ్యాయుడు సెప్టెంబర్ నెలలో 2953 పాయింట్లు సాధించారు కూడా. ఎంతో కష్టసాధ్యమైన ఈ కర్మయోగి కోర్సుల కార్యక్రమంలో ఇప్పటికి మొత్తం ఆయన 1460 కోర్సులు పూర్తి చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిషన్ కర్మయోగి కార్యక్రమంలో నిరంతరం శ్రమించి ఆ కోర్సులను పూర్తిచేయడం జరిగిందని, ఫలితంగా జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. కోర్సులను నిర్దేశిత గడువు కంటే ముందుగానే పూర్తిచేయడంతో బోనస్ పాయింట్లు లభించాయని, దాంతో తనకు ఫస్ట్ ర్యాంకు లభించిందన్నారు. ఐ గాట్ కర్మయోగి కోర్సులలో ఒక్క నెలలో 2953 పాయింట్లు సాధించడం ఒక రికార్డు అని, సెప్టెంబరు నెలలో దేశవ్యాప్తంగా 23,28,653 మందితో పోటీపడి జాతీయస్థాయి ర్యాంకును పొందగలగడం తన జీవితంలో ఓ మరపురాని విజయమని ఆనందం వ్యక్తం చేశారు.



## రామకృష్ణ మిషన్‌లో..
# ఫిజియోథెరపీ సేవలు

నెల్లూరులోని 3వ మైలు నవలాకులతోటలో ఉన్న రామకృష్ణ మిషన్‌లో ఇటీవల ఫిజియోథెరపీ సేవలు ప్రారంభమయ్యాయి. స్వామి ప్రజ్ఞారణ్య యోగ-ఫిజియో థెరపీ కేంద్రాన్ని ప్రారంభించగా, తిరుపతిలోని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానందజీ మహరాజ్ చేతులమీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సి.కె దాస్ అకాడమీ వారి దాతృత్వంతో ఏర్పాటైన ఈ సేవలను ప్రారంభించినందుకు ఆ సంస్థ నిర్వాహక ధర్మకర్త డా.సి.ఉమామోహన్ (అనంతపురం), రామకృష్ణ మిషన్ స్వామీజీలకు కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణ మిషన్ ఉపాధ్యక్షులు డా.మోహన్‌రాజు సి.కె దాస్ అకాడమీ వారి చొరవను అభినందించారు. ఫిజియోథెరపీ వైద్యనిపుణులు డా. వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ, నేటి సమాజంలో ఫిజియోథెరపీ సేవల ఆవశ్యకతను వివరించారు. నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ మహరాజ్ మాట్లాడుతూ, సేవా దృక్పథంతో, నామమాత్రపు రుసుముతో అందించే ఈ సేవలను అందరూ వినియోగించుకోవలసిందిగా కోరారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. సి.కె దాస్ అకాడమీ అధ్యక్షులు వశిష్టస్వామి రామతీర్థ (పూర్వాశ్రమంలో బి. ఎల్లమందయ్య) మాట్లాడుతూ, ఈ కేంద్రం నిర్వాహకులందరికీ ఆశీస్సులందించారు. ఈ సందర్భంగా పదిమంది నిరుపేద వృద్ధులకు ఫలసరుకులను అందజేశారు. డాక్టర్ కె.జి శరత్‌చంద్ర (కర్నూలు) ఈ శిబిరంలో పాల్గొని చర్మసంబంధిత వ్యాధులున్నవారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డా.ఏ.వి సుబ్రహ్మణ్యం, టి.లక్ష్మీనారాయణరావు, జయచంద్ర, రామకృష్ణమిషన్ కార్యవర్గ సభ్యులు మణినాథ్, చిరంజీవి, పి. నాగిరెడ్డి తదితరులు పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు.

## ఎన్‌బీకేఆర్‌లో..
# 'క్వాంటమ్ కంప్యూటింగ్'



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామం ప్రారంభమైంది. ఏఐసీటీఇ ఏటీఏఎల్ వారి పౌజన్యంతో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో వారం రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు ఇందులో పాల్గొంటున్నారని, సిఎస్ఇ విభాగాధిపతి డా. ఏ.రాజశేఖర్‌రెడ్డి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతిఒక్కరికి కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలియజేశారని ఆయనన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అనేది క్లిష్టమైన సమస్యలను అత్యంత వేగంగా పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని, అది మెకానిక్స్ సూత్రాలను ఉపయోగించే గణన విధానమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలు తెలిపారు. ఇది సంప్రదాయ బిట్‌ల స్థానంలో క్వాంటమ్ బిట్(క్యూబిట్)లను ఉపయోగిస్తుందని, ఒకేసారి 0 మరియు 1 రెండింటి స్థితిలో ఉండగలవని, దానిని సూపర్ పొజిషన్ అంటారని వారు వివరించారు. ఈ సామర్థ్యం అనేక పరిష్కారాలను ఒకేసారి అన్వేషించ దానికి క్వాంటమ్ కంప్యూటర్లను అనుమతిస్తుందన్నారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో చాలా శక్తివంతంగా అవి పనిచేస్తాయని వారు పేర్కొన్నారు.

---

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# సమస్యలు పరిష్కరించండి

**మంత్రి నారాయణకు సి.ఐ.టి.యు వినతి**




అమృత్ పథకం క్రింద అభివృద్ధి పనుల విషయమై ఈ నెల 5వ తేదీ గూడూరు మున్సిపల్ కార్యాలయంలో ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చర్చించారు. అనంతరం ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) నాయకులు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ సమక్షంలో మంత్రికి తమ సమస్యలను విన్నవించారు. 12వ పిఆర్‌సి కమిటీ నియామకం, కార్మికుల జీతాలపెంపు, సంక్షేమ పథకాల అమలు, సమ్మెకాలపు జీతం తదితర సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన మంత్రి నారాయణ ఈ విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి భూలోక మురళి, ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఏజీఎంయూటీకి సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



గూడూరు సబ్‌కలెక్టర్, ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రాఘవేంద్ర మీనాను అరుణాచల్ ప్రదేశ్-గోవా-మిజోరం-కేంద్రపాలిత ప్రాంతాలు (ఏజీఎంయూటీ) కేడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీఎంయూటీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి సులేఖా జగర్వార్‌ను వివాహం చేసుకున్న నేపథ్యంలో ఆయన విజ్ఞప్తి మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనుమతితో బదిలీ చేసినట్టు సిబ్బంది వ్యవహారాలశాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా రిలీవ్ కానున్నారు.



# బ్రాహ్మణుల సహకారం మరువలేనిది

**కళ్యాణ మండపం ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సునీల్**

నా విజయానికి బ్రాహ్మణులు ఎంతో సహకరించారని, వారి అభివృద్ధికి నావంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన కళ్యాణమండపంలో ఇటీవల చేపట్టిన ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా పూర్తవ్వాలంటే సమర్థుడైన వ్యక్తి ఉండాలని, బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు శివకుమార్ ఎంతో ఉత్సాహంగా దాతల నుండి సహాయం పొంది కళ్యాణ మండపం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనులకు సహాయం అందించిన దాతలను సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే సునీల్, దాత డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డిలను శిరోమణి శర్మ ఆశీర్వాదం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామమూర్తి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, కోశాధికారి లలిత, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు దొంగలొచ్చారు... జాగ్రత్త!



- డీఎస్పీ గీతాకుమారి

బంగారు ఆభరణాలు దోచుకు వెళ్లే ముఠా సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి కోరారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, విలువైన ఆభరణాలు వేసుకొని బయటకు వచ్చినపుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె మహిళలకు సూచించారు.

# నజీంబాయి సేవాభావం

**• లక్షా 30వేలతో పేదమహిళకు ఆవాసం**



ఉన్న ఇల్లు (రేకుల షెడ్డు) శిథిలావస్థకు చేరి కూలిపోగా, ఆరు బయట వీధిలోనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవితం గడుపుతున్న ఓ నిరుపేద మహిళను చూసి చలించిపోయి, ఆదుకుని తన సేవాభావం చాటుకున్నాడు నజీంబాయి. గూడూరు, మసీదు వీధికి చెందిన షేక్ నజీముద్దీన్(నజీంబాయి) హైర్‌డ్స్ వ్యాపారి. నిరుపేదలను ఆదుకోవడంలో ముందుంటారాయన. నాగభూషణమ్మ అనే పేద మహిళ ఉంటున్న రేకులషెడ్డు కూలిపోవడంతో ఆమె పరిస్థితి దారుణంగా తయారైంది. ఆమెకు భర్త లేదు. ఒక కుమారుడు ఉన్నా, మతిస్థిమితం లేక అవస్థపడుతున్నాడు. అది గమనించిన నజీంబాయి లక్షా 30వేల రూపాయలు ఖర్చుపెట్టి ఆమెకు రేకుల షెడ్డుతో పాటు బాత్రూం కూడా కట్టించి ఇచ్చాడు. ఆ మహిళను ఆదుకున్నందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆనిమెళ్ల శివకుమార్, సంఘం సభ్యులు నజీంబాయి సేవలను మెచ్చుకుని అభినందించారు.

# విద్యార్థినికి ల్యాప్‌టాప్




పేద విద్యార్థులకు సహకారం అందించాలనే సంకల్పంతో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ 1989 బ్యాచ్ విద్యార్థులు 'అందరి కోసం' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. వారి సంకల్పానికి డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ఛైర్మన్, రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తన సహకారం అందించారు. సీఎంఏ చదువుతున్న ప్రతిభావంతురాలైన పేద విద్యార్థిని యస్వినికి సురేంద్రరెడ్డి ఆర్థిక సహకారంతో ఆయన చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

# కల్యాణ వైభవం...!




నెల్లూరులోని 'వెంకటరమణ ఆర్కేడ్' అధినేత మంచికంటి సుబ్బారాయుడు - సంగీత లక్ష్మిల కుమార్తె **శ్రీ సాయి సుహిత - లక్ష్మణ్ మ్రినాల్** (కపిలవాయి మోహన్ మురళి - సునీతల కుమారుడు)ల వివాహం నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభ దీవెనెలు.

# ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సరికొత్త ఆలోచన

- **15ఏళ్ల సహార్షరెడ్డితో అండర్‌బ్రిడ్జి ప్రారంభోత్సవం**



నెల్లూరులో జనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద ఆధునీకరణ పనులు పూర్తికావడం, ఈనెల 3న బ్రిడ్జిని పునఃప్రారంభించడం జరిగాయి. ఆ ప్రారంభోత్సవం ఎవరో పెద్దలతో కాదు, చిన్నవయసు వారితోనే చేయించి అందరి ప్రశంసలందుకుంటున్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఇప్పటివరకు శిలాఫలకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను మంత్రులు ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు మాత్రమే ప్రారంభించేవారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాల్లో కేవలం పాత నేతలే కాక, భావిభారత పౌరులకు కూడా అవకాశం కల్పించాలనే సదాశయంతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వినూత్నమైన నిర్ణయం తీసుకున్నారు. తొలిసారిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో, కేవలం 15 ఏళ్ల వయసున్న పుట్టంరెడ్డి సహార్షరెడ్డి చేయి పట్టుకుని మరీ శ్రీధర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేయించడంతో స్థానికుల్లో సంతోషం వ్యక్తమైంది. ఆ బాలుడు మరెవరో కాదు, ప్రముఖ నిర్మాత, జనసేన నేత చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మనవడు కావడం విశేషం. ఏదేమైనా, భావితరాలను రాజకీయాల వైపు ప్రోత్సహించేలా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇలాంటి మంచి నిర్ణయం తీసుకోవడం స్ఫూర్తిదాయకమని నెల్లూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వానకే మోకాటి లోతు నీళ్ళు నిలబడే ఈ అండర్‌బ్రిడ్జి ఇంత కాలానికి బాగవడంతో నెల్లూరు ప్రజలు ఆనందం వ్యక్యం చేస్తున్నారు.



# రాజకీయ నాయకురాలా.. మత ప్రచారకురాలా?

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు చెప్తున్నారు. అది చాలదన్నట్లు, ఇంకా అభివృద్ధి పనుల పేరుతో కూడా టీటీడీ సొమ్మును వెచ్చించాలా..? మరి ప్రభుత్వాలు ఉండేది ఎందుకు? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇమామ్‌లు, పాస్టర్లకు గౌరవ వేతనాలు, చర్చిలు, మసీదులకు ఆర్థిక ప్రోత్సాహాలు, హజ్ యాత్రలకు గ్రాంట్‌లు అందిస్తున్న ప్రభుత్వాలు, హిందూ సంస్థల అభివృద్ధికి మాత్రం రూపాయి విదల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో షర్మిల తన మిడిమిడి జ్ఞానంతో అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తూ హిందూ మనోభావాలను మరింతగా దెబ్బతీస్తున్నారని ఆగ్రహస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు మతం, కులం వంటి వాటిని దూరంగా ఉంచి, హుందాగా ప్రవర్తించాలని హిత బోధ చేస్తున్నారు. షర్మిల వంటి నేతల ప్రవర్తన, రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే కొందరు హిందువులు ఉద్రేకాలకు గురవుతూ సహనం కోల్పోయే పరిస్థితి నెలకొంటోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా షర్మిల హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మత సామరస్యం ఉన్న దేశంలో మతచిచ్చు రగిల్చే నాయకులకు తగిన బుద్ధి చెబుతామంటూ హెచ్చరిస్తున్నారు. హిందూ సోదరులు తిరుమల వెంకన్నకు ఇచ్చే కానుకల ద్వారా వచ్చే ఆదాయంతో దళితవాడల్లో 5000 కాదు, 50 వేల ఆలయాలు కట్టుకున్నా, కుహనా రాజకీయ నాయకులకు వచ్చే నష్టం ఏంటని ఏకిపారేస్తున్నారు.

## సుప్రీంకోర్టులో బూటు వివాదంతో..

తాజాగా భారత సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై విచారణ సమయంలో ఓ న్యాయవాది బూటు విసిరేందుకు యత్నించడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనలో నిందితుడిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుని, ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు వదిలేశాయి. ఆ సమయంలో ఆ న్యాయవాది సనాతన ధర్మాన్ని అవమానించేలా వ్యవహరించే వారిని వదిలిపెట్టకూడదంటూ బిగ్గరగా కేకలు వేయడం గమనార్హం. నిజానికి భారత న్యాయవ్యవస్థకు ప్రతీకైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పైన బూటు విసిరేందుకు యత్నించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీన్ని అందరూ తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోడి నుంచి సామాన్యుడి వరకూ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. హిందువుల్లో నానాటికీ పేరుకు పోతున్న అసంతృప్తి, సొంత దేశంలోనే తమ మతానికి జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అవమానాలను సహించలేక కుమిలిపోతున్న సగటు హిందువు ఆవేదనకు ఇలాంటి ఘటనలే నిదర్శనం అని కొందరు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే సుప్రీం కోర్టులో వాదించే స్థాయికి ఓ న్యాయవాది చేరుకోవడం అంత సులభమైన విషయం కాదు. ఎంతో పరిజ్ఞానం, రాజ్యాంగంపై పట్టు, ఆర్టికల్స్‌ను అవపోసన పట్టిన అనుభవం ఉంటే కానీ ఆ స్థాయికి చేరుకోలేరు. అంతటి సామర్థ్యం ఉన్న న్యాయవాది మధ్యప్రదేశ్‌లోని ఖజరహోలో శిథిలావస్థకు చేరుకున్న ఏడడుగులు ఎత్తయిన విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయితే దాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తోచిపుచ్చింది. పైగా ఈ కేసు విచారణ సమయంలో ఇలాంటివి కోర్టు పరిధిలోకి రావంటూనే, వెళ్లి విష్ణువుకే సమస్య చెప్పుకోండి అంటూ సీజేఐ వ్యంగ్యంగా మాట్లాడారు. దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆ న్యాయవాది ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తేలింది. ఇంత అనుభవం ఉన్న వ్యక్తే ఉద్రేకం తట్టుకోలేక విచక్షణ కోల్పోతే ఇక సామాన్య హిందువు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఒకప్పుడు 90శాతంగా ఉన్న హిందువులు ప్రస్తుతం 75 శాతానికి పడిపోవడం, నానాటికీ దేశంలో మత మార్పిడిలు ఎక్కువైపోతుండడం వారి అసహనానికి అసలు కారణంగా కనిపిస్తోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో తమకున్న ఒక్కగానొక్క దేశంలోనే తాము వివక్షను అనుభవిస్తున్నామని వారంతా వాపోతున్నారు. మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవడం తప్పులేదని, అయితే లౌకికవాదం పేరుతో హిందువులకు అన్యాయం చేయడం, అవమానించడం మాత్రం సహించకలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా బూటు విసిరేందుకు యత్నించిన న్యాయవాదిపై ఎలాంటి చర్య తీసుకోవద్దు, క్షమించి వదిలేయాలంటూ ఈ వ్యవహారంలో హుందాగా ప్రవర్తించిన సీజేఐ జస్టిస్ గవాయ్ ఔన్నత్యాన్ని మాత్రం ప్రశంసించాల్సిందే. అయితే దాడికి పాల్పడిన న్యాయవాది మాత్రం తీర్పుల సమయంలో సనాతన ధర్మాన్ని కించపరిస్తే, విమర్శిస్తే తట్టుకోలేక ఈ ఘటనకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ దాడి పర్యవసానాలు ఏవైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని ప్రకటించడం ఆసక్తికరం.

## మిగతా వారిలా హిందువులకూ!

ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకూడదంటే ప్రభుత్వాలు హిందూ మత విస్తృతికి, అభివృద్ధికి సాయం చేయడంతో పాటు ఇతర మతాలకు ఇచ్చేవిధంగా ప్రోత్సాహకాలు అందించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వాలు హిందువులకు ఎలాంటి సహాయం చేయకపోగా, చివరికి టీటీడీ వంటి హిందూ సంస్థలు తమ నగదుతో చేసే ఆలయాల నిర్మాణానికి కూడా షర్మిల వంటి నాయకురాళ్ళు, కుహనా మేధావులు, ఇంగితజ్ఞానం లేని లౌకికవాదులు అడ్డు తగలడం తమను అవమాన పరచడమే అని స్పష్టం చేస్తున్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమే ధ్యేయంగా కొందరు కంకణం కట్టుకుని పనిచేస్తున్నట్లుందని ఆరోపిస్తున్నారు.

ఏదేమైనా, భారతదేశంలో మెజారిటీలై ఉండి హిందువులు హీనంగా బతుకులీడ్చుతుండడం మాత్రం తీవ్ర అభ్యంతకరమైన విషయమే. గతంలో భారత్, పాక్ విడిపోయిన సమయంలో చోటు చేసుకున్న మత ఘర్షణలకు ఎందరో అమాయకులు బలయ్యారు. చివరికి మత కారణంగా రేగిన ఉద్రేకం కారణంగానే గాంధీ మహాత్ముడిని సైతం మనదేశం కోల్పోయింది, ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ మత విద్వేషాలు, అభద్రతా భావాలు, అనుమానాలు, అపనమ్మకాలతో దేశంలో శాంతికి భంగం వాటిల్లకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం షర్మిల వంటి రెచ్చగొట్టే నాయకురాళ్ళ నోటికి తక్షణం అడ్డుకట్ట వేయాలి. మత వ్యవహారాల్లో ప్రభుత్వాలు కూడా తటస్థ విధానాన్ని అనుసరించి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. అప్పుడే రాజ్యాగంలో పేర్కొన్న విశ్వశాంతితో పాటూ విశ్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందుతుంది. పది కాలల పాటు భారత్ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందన్నది మేధావుల అభిప్రాయం. ప్రజాక్షేత్రంలో, ప్రజల సంక్షేమం కోసం పాటుపడతాం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ తిరుగుతున్న షర్మిల నిజంగా రాజకీయ నాయకురాలా లేక ఆ ముసుగులో వున్న మత ప్రచారకులారా అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అనుమానాలకు, అపోహాలకి తావులేకుండా షర్మిల తన రాజకీయ భవిష్యత్ ప్రస్థానాన్ని కొనసాగిస్తే మంచిదని సూచిస్తున్నారు. అలా ఉండలేని పక్షంలో ఆమె మత ప్రచార సభలని, కార్యక్రమాలని చేసుకుంటూ రాజకీయాల నుండి విరమిస్తే మంచిదని సలహా ఇస్తున్నారు..!

# విద్యతోనే సమున్నత స్థాయి - డా. సతీష్‌రెడ్డి



విద్యతోనే సమాజంలో సమున్నతస్థాయి లభిస్తుందని డిఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. ఈనెల 8న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో '23 మునిసిపల్ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థుల శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధి' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రామేశ్వరంలోని చిన్నగ్రామంలో జన్మించి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, విద్యలో రాణించి గొప్ప శాస్త్రవేత్త అయ్యారని, అనంతరం భారత రాష్ట్రపతిగా కూడా అత్యున్నతస్థాయి పదవిని అధిష్టించారని ఆయన చెప్పారు. దేశంలో క్షిపణులకు నాందిపలికింది ఆ మహనీయుడేనన్నారు. నేడు స్వదేశీ ఆలోచనలతో, ఆత్మనిర్భర్‌తో ఇటీవల పాక్‌పై జరిగిన యుద్ధంలో భారత్ విజయం సాధించిందన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు విద్యలో ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డా. సతీష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలాజీరావు, కమిషనర్ వైఓ నందన్, డిప్యూటి డైరెక్టర్ మాధురి, డిప్యూటి డీఇఓ నాయక్, నెల్లూరు అర్బన్ ఎంఇఓ తిరుపాలు పాల్గొన్నారు.

## నరసింహకొండ దేవాలయం ఛైర్మెన్‌గా..
# బాధ్యతలు చేపట్టిన అచ్యుత్ శంకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ఛైర్మెన్‌గా ఈనెల 8న ఇందుపూరు అచ్యుత్ శంకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. తనను ఛైర్మెన్‌గా నియమించడం పట్ల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు గిరిధర్ రెడ్డిలకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో దేవాలయం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, మాజీ ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడి యత్నానికి నిరసనగా...
# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించిన ఘటనను నిరసిస్తూ నెల్లూరులోని న్యాయవాదులు ఈనెల 8న విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం దారుణమన్నారు. ఇది న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యపరెడ్డి, నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో జనసేన లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు..సీనియర్ న్యాయవాది చదలవాద రాజేష్, న్యాయవాదులు స్వర్ణప్రసాద్, సుజిత్, రామయ్య, మహిళా న్యాయవాదులు లత శ్రీనివాస్, భ్రమరాంబిక తదితరులు పాల్గొన్నారు.

# గొలగమూడి ఆశ్రమంపై వివాదాలు సృష్టించకండి!

## నిజాయితీ అధికారిపై నిందలు వేయకండి! - ఎమ్మెల్యే సోమిరెడ్డి హితవు

సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో కొలువై ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంపై లేనిపోని వివాదాలు సృష్టించవద్దని, నిజాయితీగా పనిచేసే ఇఓపై నిందలు వేయొద్దని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హితవు పలికారు. గొలగమూడి ఆశ్రమంపై, అక్కడ చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఇఓ బాలసుబ్రహ్మణ్యంపై వస్తున్న ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ, కోట్లాది మంది భక్తులు ఆరాధించే దేవుడు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి అని అన్నారు. అక్కడి ఇఓ బాలసుబ్రహ్మణ్యం తన జీవితాన్ని ఆశ్రమానికి అంకితం చేశారని ఆయన అంటూ, గొలగమూడి ఆశ్రమంపై అనవసర వివాదాలు సృష్టించేవారి సంగతిని ఆ వెంకయ్యస్వామే చూసుకుంటారన్నారు. ఇటీవల నెల్లూరులోని తమ కార్యాలయంలో వెంకయ్యస్వామి భక్తులు, ఉభయకర్తలు, దాతలు తనను కలిశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 1982 ఆగస్టు 24న గొలగమూడిలో శాశ్వత యోగనిద్రలోకి చేరుకున్నారని, అయితే అప్పట్లో స్వామి వారిని వారి కుటుంబసభ్యులు, బంధువులెవరూ పట్టించుకోలేదని, స్వామివారి భక్తులే ఆయన సమాధికి గుడి కట్టించి పూజలు చేస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు. ఆ తర్వాత క్రమేణా వెంకయ్య స్వామి ఆశ్రమం అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. అప్పట్లో కొన్ని వివాదాల నేపథ్యంలో హైకోర్టు గొలగమూడి ఆశ్రమానికి ఈఓగా టీటీడీ విశ్రాంత జేఈఓ బాలసుబ్రహ్మణ్యంను నియమించిందని ఆయన తెలిపారు. అప్పటికే ఐఏఎస్ అధికారిగా రిటైర్డ్ అయిన బాలసుబ్రహ్మణ్యం టాటా కంపెనీలో కీలక పోస్టులో ఉన్నారని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ఆశ్రమానికి ఈఓ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ హైకోర్టు జడ్జి, చీఫ్ ఇంజనీర్, ఇద్దరు చార్టెడ్ అకౌంటెంట్లతో పాటు భక్తులు, దాతలు కలిసి 13మందితో హైకోర్టు ఈ ఆశ్రమానికి కమిటీని నియమించిందని, జిల్లా కలెక్టర్, ఎస్పీ కూడా ప్రత్యేక అధికారులుగా ఆశ్రమ నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారు.

### బాలసుబ్రహ్మణ్యం వచ్చాక..
### గొలగమూడికి మహర్దశ :

2006లో బాలసుబ్రహ్మణ్యం గొలగమూడికి రావడంతో ఆశ్రమం అభివృద్ధికి వేగవంతంగా చర్యలు చేపట్టారన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టేనాటికి ఆశ్రమ ఆస్తుల విలువ రూ.7 కోట్లు ఉంటే, ఇప్పుడు ఆస్తుల విలువ సుమారు రూ.200 కోట్లు దాటిందన్నారు. ఆశ్రమంలో ఏటా 10 లక్షలమందికి పైగానే భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారన్నారు. ఆశ్రమంలో ఉన్న విద్యాలయంలో ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల వరకు 450 మంది ఉచితంగా విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. ఇఓగా ఆయన వచ్చాక అక్కడున్న విద్యాలయాలకు నూతన భవనాలను నిర్మించారని, ఎనిమిదేళ్ల పాటు ఆయన టాటా కంపెనీలో సేవలందించినందుకు టాటా కంపెనీ యాజమాన్యం ఆయనకు పారితోషికంగా ఇచ్చిన కోటి రూపాయలతో ఆయన ఆశ్రమ ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ కట్టించారని సోమిరెడ్డి వివరించారు. అంతే కాదు, ఒక్క రూపాయి జీతం లేకుండా ఇఓ బాలసుబ్రహ్మణ్యం 24 గంటలూ వెంకయ్యస్వామి సేవలో ఉంటున్నారని, ఆశ్రమంలో ఉచిత సేవలు అందించే ఆస్పత్రిని కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. దివ్యాంగులైన భక్తులకు ఈ ఆశ్రమం ద్వారా కృత్రిమ అవయవాలను ఉచితంగా ఇస్తున్నారన్నారు. గొలగమూడి ఆశ్రమ ఆస్తుల విలువ ఇప్పుడు రూ.200 కోట్లకు పెరిగిన నేపథ్యంలో, వెంకయ్యస్వామి బంధువుల పేరుతో కొందరు వివాదాలు సృష్టించడం తగదని సోమిరెడ్డి హితవు పలికారు. ఇఓ బాలసుబ్రహ్మణ్యం అవినీతికి పాల్పడుతున్నారంటూ హైకోర్టుకు కొందరు ఫిర్యాదులు చేయడం దురదృష్టకరమన్నారు. బాలసుబ్రహ్మణ్యం కుమారులు రెండు ఫ్లాట్లు కొనుగోలు చేశారని ఫిర్యాదులు చేశారని, అయితే వారి కుమారులు పెద్ద ఉద్యోగాలు చేస్తూ నెలకు లక్షలాది రూపాయలు జీతాలు పొందుతున్నారని, వాళ్లు ఆమాత్రం రెండు ఫ్లాట్లు కొనుగోలు చేయలేరా?.. అని ఆయన ప్రశ్నించారు. వెంకయ్యస్వామి ఆశ్రమంపై బంధువుల పేరుతో వివాదాలు సృష్టిస్తే.. భక్తులే తిరగబడతారని గుర్తుంచుకోవాలన్నారు. భక్తులందరం బాలసుబ్రహ్మణ్యంకు అండగా నిలుస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు.



### ఎన్టీఆర్ హయంలో.. తిరుమల జేఈఓగా బాలసుబ్రహ్మణ్యం

ఐఏఎస్ అధికారిగా సుదీర్ఘకాలం అందించిన సేవలను గుర్తించి బాలసుబ్రహ్మణ్యంను అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారక రామారావు ఆయన్ను తిరుమల జేఈఓగా నియమించారని సోమిరెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. తిరుమల చరిత్రలో తొలి జేఈఓ కూడా బాలసుబ్రహ్మణ్యమేనన్నారు. భగవంతుని సేవ కోసం కొత్తగా ఆ పోస్టును ఎన్టీఆర్ సృష్టించి బాలసుబ్రహ్మణ్యంకు ఆ బాధ్యతలు అప్పజెప్పారన్నారు. దాదాపు పదకొండేళ్ల పాటు ఆయన టీటీడీ జేఈఓగా పనిచేస్తూ, శ్రీ వెంకటేశ్వరస్వామికి నిజాయితీగా సేవలందించి మచ్చలేని అధికారిగా గుర్తింపు పొందారని ఆయన తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం టాటా కంపెనీలోనూ ఆయన విశేష సేవలందించారని, బాలసుబ్రహ్మణ్యంలోని అంకితభావాన్ని గుర్తించిన హైకోర్టు ఆయనకు గొలగమూడి ఆశ్రమ బాధ్యతలు అప్పజెప్పిందని, ఆనాటినుంచి నేటి వరకు దైవసేవలో ఉంటూ, ఆ తర్వాత శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమానికి కూడా ఆయన తన జీవితాన్ని అంకితం చేసి విశేష సేవలందిస్తున్నారన్నారు. అలాంటి నిజాయితీ అధికారి అయిన ఇఓ బాలసుబ్రహ్మణ్యంపై నిందలు వేస్తే, వారి సంగతి ఆ వెంకయ్యస్వామే చూసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

## టూకీగా...



### కరటంపాడుకు 'స్వచ్ఛ పంచాయతీ' అవార్డు

ఆత్మకూరు మండలంలోని కరటంపాడు గ్రామ పంచాయతీకి 'స్వచ్ఛ పంచాయతీ' అవార్డు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ ఈనెల 6న ఆ అవార్డును అందుకున్నారు. తమ పంచాయతీకి అవార్డు రావడం పట్ల గ్రామసర్పంచ్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

### పాతబిట్రగుంటలో పిడుగు పడి వ్యక్తి దుర్మరణం

బోగోలు మండలంలోని పాత బిట్రగుంటలో పిడుగు పడి ఎన్.రామచంద్రయ్య(40) దుర్మరణం పాలయ్యాడు. పశువులను మేతకు తీసుకుని పొలాల్లోకి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక అధికారులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం కావలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### విడవలూరులో జీఎస్టీపై అవగాహన

మండల కేంద్రమైన విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఈనెల 6న జీఎస్టీపై అధికారులు అవగాహన కలిగించారు. జీఎస్టీ సంస్కరణలతో వినియోగదారులకు కలుగుతున్న మేలును వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కలువాయిలో పశువైద్య సిబ్బంది సమావేశం

మండల కేంద్రమైన కలువాయిలోని ప్రభుత్వ పశువైద్యశాలలో ఈనెల 6న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.గురుజయంతి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.గోకులాల నిర్వహణ, పశువులకు ఇవ్వాల్సిన టీకాలు వగైరాలపట్ల తమ శాఖ సిబ్బందికి తగు అవగాహన కలిగించారు. కలువాయి, చేజర్ల మండలాలకు చెందిన పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అల్లూరులో ఉపాధ్యాయులకు సన్మానం

అంతర్జాతీయ ఉపాధ్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6న మండల కేంద్రమైన అల్లూరులోని రామకృష్ణా కళాశాలలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు పెనుమూడి వెంకటేశ్వర్లు, వేమూరు రామయ్యలను కళాశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు, పాఠశాలకు వారందించిన సేవలను కొనియాడారు.

### వేదగిరి నరసింహునికి గరుడ సేవ

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 7న ఆలయ అర్చకులు వైభవంగా గరుడసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో కొండకు వచ్చి గిరిప్రదక్షిణ చేసుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఓ గోపి ఈ పూజలను పర్యవేక్షించారు.

### వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు


వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఈనెల 7న విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు, అనుమతులు లేకుండా వెళ్తున్న అయిదు వాహనాలను సీజ్‌చేసి వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

### మన్మాదాపురంలో ఆశా కార్యకర్తల సమావేశం

పొదలకూరు మండలంలోని మన్మాదాపురంలో ఈనెల 7న ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మాట్లాడుతూ, డెంగీ-మలేరియా వంటి వ్యాధుల పట్ల ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వైద్యసేవలందించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఆరోగ్యాధికారిణి వరలక్ష్మి పాల్గొన్నారు.

### సీతారామపురంలో వన్యప్రాణి వారోత్సవాలు

సీతారామపురంలోని ఆదర్శపాఠశాలలో ఈనెల 7న అటవీ అధికారుల ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు జరిగాయి. అటవీశాఖ అధికారి కేవీ ప్రసాద్ మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పర్యావరణ సమతుల్యత ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ అడవులను కాపాడుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.



ప్రభుత్వ-ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహోన్నత 'జీరో పావర్టీ - P4' కార్యక్రమానికి అనుగుణంగా

- పిల్లలను ఉపాధి పొందగలిగే, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం
- రైతుల నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు చేసి, వారికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం
- ఎడ్లు మరియు రైతుల కోసం స్థిరమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడం

# శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి

## అక్టోబర్ 10, 2025, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో

## ప్రారంభంకానున్న సంస్థలు

### నంద గోకులం లైఫ్ స్కూల్







- ఆర్థికంగా వెనుకబడిన, మేధస్సు (High IQ) కల బాలుర కోసం రెసిడెన్షియల్ పాఠశాల.
- నంద గోకులం ప్రాంగణంలోని 19 ఎకరాల్లో క్యాంపస్.
- ప్రపంచ స్థాయి మౌలిక వసతులు; సాంకేతిక సామర్థ్యంగల Wi-Fi క్యాంపస్.
- పూర్తిగా ఎయిర్-కండిషన్డ్ పాఠశాల; అర్థవంతంగా రూపొందించిన బోధనా స్థలాలు.
- గోవులు, ఎడ్ల మధ్య ప్రకృతి సహజ బాల్యం.
- సేంద్రీయ వ్యవసాయంలో పాల్గొనడం.

**విద్యతో జీవితాల అభ్యున్నతి**

### విశ్వ సముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్





- 24 ఎకరాల్లో బయో-ఎథనాల్, కార్బన్ డయాక్సైడ్ ($CO_2$), డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ విత్ సాల్యూబుల్స్ (DDGS) ఉత్పత్తి.
- ఈ ప్రాంతంలో 15,000 టన్నులకుపైగా నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు (250 కి.మీ పరిధిలోని 300కు పైగా రైస్ మిల్లుల నుంచి).
- నూకలను (బ్రోకెన్ రైస్) ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగించి రోజుకు 200 KLPD ఎథనాల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం.
- భారత ప్రభుత్వ ఎథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (EBP) ద్వారా పెట్రోల్‌లో 20% మిశ్రమ లక్ష్యానికి మద్దతు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైతు-హిత హరిత కార్యక్రమం**

### నంద గోకులం సేవ్ ద బుల్ కాజ్





- 280 ఎకరాల విస్తీర్ణంలో 400కు పైగా ఎడ్లు, ఆవులు, దూడలకు ఆశ్రయం.
- అంతరించిపోతున్న దేశీయ ఎడ్ల జాతుల పునరుద్ధరణ.
- 'నంది పవర్' - ప్రత్యేకంగా రూపొందించిన ఎడ్ల ట్రెడ్మిల్; సుమారు 5 KW విద్యుత్ ఉత్పత్తి, తద్వారా రైతుకు ఎడ్ల పోషణకై సరిపడ ఆదాయం.
- డిజిటల్ బుల్ అడాప్షన్ - ఎవరైనా వర్చువల్‌గా ఎద్దును దత్తత తీసుకుని రైతులకు మద్దతు ఇవ్వగలరు.
- అడాప్షన్ లింక్: https://nandhagokulam.com/adopt

**ఎడ్లను సంరక్షించి, దేశీయ జాతులను పునరుజ్జీవింపచేసే కార్యక్రమం**

vishwasamudragroup.com • vishwasamudra.in • chintasasidharfoundation.com • nandhagokulam.com • nglifeschool.com • vsbio.in

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com